శుక్రవారం
22-12-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 180
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

జేఎన్ 1పై అప్రమత్తతే ముఖ్యం

న్యూఢిల్లీ: కొవిడ్-19 మళ్లీ పడగ విప్పింది. మూడు రాష్ట్రాల్లో కేసులు నమోదవుతున్నాయి. కొత్త వేరియంట్ జేఎన్.1 వేగంగా వ్యాపిస్తోంది. దీంతో అప్రమత్తం ఉండాలని కేంద్రం ఆదేశాలిచ్చింది. జేఎన్.1 వేరియం ట్ గురించి ఆందోళన అక్కర్లేదని, అప్రమత్తంగా ఉంటే సరిపోతుందని వైద్యులు సూచించారు. అందుబాటులో ఉన్న చికిత్సలు దీనిపై ప్రభావవం తంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. మాస్కు ధరించడం, భౌతిక దూరం పాటించడం, చేతులను తరచుగా శుభ్రం చేసుకోవడం, రద్దీ ఎక్కువగా ఉన్న ప్రదేశాలకు వెళ్లకపోవడం వంటివి పాటించడం ద్వారా వైరస్ వ్యాప్తిని అరికట్టవచ్చన్నారు. జేఎన్.1 ఒమిక్రాన్ వేరియంట్‌లోని బీఏ.2.8.6 శాఖకు చెందినది. ఇది మనిషి రోగనిరోధక వ్యవస్థను అధిగమిస్తుందని పలు అధ్యయనాలు పేర్కొన్నాయి.

మళ్లీ బ్రేక్!

- విశాఖకు కార్యాలయాల తరలింపునకు అడ్డుకట్ట
- పంతం పట్టిన జగన్ సర్కార్ యత్నాలకు ఎదురుదెబ్బ
- యథాతథ స్థితి కొనసాగించాలని హైకోర్టు ఆదేశం
- త్రిసభ్య ధర్మాసనానికి కేసు బదిలీ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వచ్చే ఎన్నికల్లోగా ఎట్టిపరిస్థితుల్లో విశాఖపట్నం వెళ్లాలన్న వైసీపీ ప్రభుత్వ ప్రయత్నాలకు మళ్లీ బ్రేక్ పడింది. రాష్ట్ర సమగ్రాభివృద్ధి పేరుతో మూడు రాజధానులు ఏర్పాటు చేయాలని జగన్ ప్రభుత్వం శాసనసభలో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించిన విషయం తెలిసిందే. దీనిలో భాగంగా వైసీపీ ప్రభుత్వం పరిపాలనా రాజధానిగా పేర్కొంటున్న విశాఖకు తరలివెళ్లేందుకు మూడేళ్లుగా చేయని ప్రయత్నం లేదు. కానీ ఆచరణలో సాధ్యపడకపోవడంతో సీఎం క్యాంపు కార్యాలయం, ఉత్తరాంధ్ర అభివృద్ధిపై తరచూ సమీక్షలు నిర్వహించాల్సి ఉందన్న పేరుతో ఈ నెలలో ప్రభుత్వ కార్యాలయాలను విశాఖకు తరలించేందుకు దొడ్డిదారి యత్నాలు ప్రారంభించింది. ఫిబ్రవరి, మార్చిలో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనున్న నేపథ్యంలో ప్రభుత్వం మూడు రాజధానులపై ఇచ్చిన హామీ అమలు చేసి చూపేందుకు ఆఘమేఘాలపై చర్యలు చేపట్టింది. విశాఖలో సీఎం క్యాంపు కార్యాలయంతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల కార్యాలయాలు ఏర్పాటు చేసేందుకు అవసరమైన భవనాలను ఎంపిక చేసేందుకు ముగ్గురు సభ్యులతో అధికారుల కమిటీ నియమించింది. ఈ కమిటీ వైజాగ్‌లో రిషికొండ, మిలీనియం టవర్స్‌తో పాటు వేర్వేరు చోట్ల కార్యాలయాలు గుర్తించింది. వీటిని సీఎం, మంత్రులు, అధికారుల కోసం కేటాయిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. దీన్ని సవాల్ చేస్తూ అమరావతి రైతులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ప్రభుత్వ ప్రయత్నాలకు హైకోర్టులో గురువారం గట్టి ఎదురుదెబ్బ తగిలింది. రైతుల పిటిషన్‌పై రెండు పక్షాల వాదనలు విన్న ఉన్నత న్యాయస్థానం...వైజాగ్‌కు సీఎం క్యాంపు కార్యాలయంతో పాటు ఇతర కార్యాలయాలు తరలించేందుకు వీలుగా ఇప్పటికే జారీ చేసిన జీవోలను నిలిపేస్తూ కీలక ఆదేశాలు ఇచ్చింది. అంతేకాకుండా ఈ కేసును ముగ్గురు సభ్యుల విస్తృత ధర్మాసనానికి బదిలీ చేసింది. త్రిసభ్య ధర్మాసనంలో ఈ పిటిషన్‌పై తదుపరి విచారణ జరిపే వరకు యథాతథ స్థితి అమలులో ఉంటుందని హైకోర్టు స్పష్టం చేసింది. దీంతో త్రిసభ్య ధర్మాసనం సీఎం క్యాంపు కార్యాలయం తరలింపుపై జరుగుతున్న కేసు విచారణతో కలిపి దీన్ని కూడా విచారించనుంది. మొత్తానికి ఈ పరిణామాలతో విశాఖ తరలివెళ్లి దానిని పరిపాలనా రాజధానిగా చేయాలని పంతం పట్టిన వైసీపీ ప్రభుత్వం కల కలలాగే మిగిలే పరిస్థితి కనపడుతోంది.

ఓట్ల అక్రమాలపై కదలిక

- టీడీపీ, వైసీపీ పరస్పర ఫిర్యాదులపై విచారణ
- నేడు, రేపు కేంద్ర ఎన్నికల సంఘం అధికారుల పర్యటన
- అధికారుల బదిలీలు, పోస్టింగ్‌లపై ఈసీ మార్గదర్శకాలు



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఆంధ్ర ప్రదేశ్‌లో పెద్దఎత్తున ఓట్ల అవతవకలు, అక్రమాలు చోటు చేసుకున్నట్లు అధికార, ప్రతిపక్ష పార్టీలు పోటాపోటీగా ఫిర్యాదులు చేయడంతో ఎట్టకేలకు కేంద్రంలో కదలిక వచ్చింది. కేంద్ర ఎన్నికల సంఘం అధికారుల బృందం రెండురోజుల పాటు రాష్ట్రంలో పర్యటించాలని నిర్ణయించింది. సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్లు ధర్మేంద్ర శర్మ, నితేశ్ వ్యాస్ సహా డిప్యూటీ ఎన్నికల కమిషనర్ హిర్దేశ్ కుమార్ బృందం ఈనెల 22, 23 తేదీల్లో ఏపీలో పర్యటించనున్నట్లు అధికారులు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో కేంద్ర ఎన్నికల సంఘం తొలుత సమావేశం నిర్వహిస్తుంది. 2024 ఓటర్ల జాబితా రూపకల్పనతో పాటు అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల నిర్వహణ సన్నద్ధతపై ఈసీ బృందం సమీక్షించనుంది. జిల్లాల వారీగా ఓటర్ల జాబితా, ఎన్నికల నిర్వహణ సన్నద్ధతపై జిల్లా కలెక్టర్లు నివేదికలు సమర్పించనున్నారు. ఈ నెల 23న సీఎస్, డీజీపీతో పాటు కేంద్ర ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులతో ఎన్నికల సంఘం అధికారులు ప్రత్యేకంగా భేటీ కానున్నారు.

అధికారుల బదిలీలు, పోస్టింగ్‌లపై ఈసీ మార్గదర్శకాలు

లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలకు ఎన్నికలు జరగనున్న నాలుగు రాష్ట్రాల్లో అధికారుల బదిలీలు, పోస్టింగ్‌లపై కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ మేరకు ఆంధ్ర ప్రదేశ్, ఒడిశా, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాల ఎన్నికల ప్రధానాధికారులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు ఆదేశాలు పంపింది. ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో దీర్ఘకాలికంగా ఒకే చోట పనిచేస్తున్న అధికారులు ఎన్నికల నిర్వహణలో ఉండకూడదన్న నిబంధనల మేరకు బదిలీలు, పోస్టింగ్‌లపై మార్గదర్శకాలు జారీ చేసింది. నేరుగా ఎన్నికల నిర్వహణతో సంబంధం ఉన్న ఏ అధికారి కూడా సొంత జిల్లాలో ఉండకూడదని స్పష్టం చేసింది. మూడేళ్లుగా ఒకే జిల్లాలో పనిచేస్తున్న లేదా 2024 జూన్ 30 నాటికి మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకుంటున్న వారిని కొనసాగించకూడదు. ప్రత్యామ్నాయాలు లేని చిన్న రాష్ట్రాల్లో మాత్రం సంబంధిత అంశాన్ని ఈసీ దృష్టికి తీసుకురావాలి. జిల్లాల ఎన్నికల అధికారులు, ఉపఎన్నికల అధికారులు, రిటర్నింగ్ అధికారులు, ఈఆర్వో, ఏఈఆర్వోలతో పాటు తహశీల్దార్‌లు, బ్లాక్ డెవలప్‌మెంట్ అధికారుల వరకూ ఈ

- మిగతా 2 లో

పెన్షనర్లకు శుభవార్త

రూ.3 వేలకు పెంచుతూ ఉత్తర్వులు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని పెన్షనర్లకు ప్రభుత్వం శుభవార్త అందించింది. వైఎస్ఆర్ పెన్షన్ కానుకను జనవరి ఒకటవ తేదీ నుంచి మూడు వేల రూపాయలకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి విభాగం ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు వైసీపీ ప్రభుత్వం పెన్షన్ అమలుకు శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం ఇస్తున్న రూ.2,750 పెన్షన్‌ను రూ.3 వేలకు ప్రభుత్వం పెంచింది.

జనవరి ఒకటో తేదీ నుంచి ఈ కొత్త పెన్షన్ అమల్లోకి రానుంది. వృద్ధాప్య పెన్షన్‌తోపాటు వితంతు, చేనేత కార్మికులు, మత్స్యకారులు, ఒంటరి మహిళ తదితర విభాగాల నుంచి ప్రస్తుతం పెన్షన్ పొందుతున్న వారికి ఈ పెంపు వర్తిస్తుంది.

పార్లమెంట్ భద్రత బాధ్యత ఇక సీఐఎస్ఎఫ్‌దే

కేంద్ర ప్రభుత్వ నిర్ణయం

న్యూఢిల్లీ: పార్లమెంటు భద్రతపై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పార్లమెంట్ భవన సముదాయంలో సమగ్ర భద్రత బాధ్యతను సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్ఎఫ్)కు అప్పగించాలని కేంద్రం నిర్ణయించినట్లు ప్రభుత్వ వర్గాలు గురువారం వెల్లడించాయి. ఇటీవల లోక్‌సభలోకి దుండగులు ప్రవేశించి రంగుల పొగతో సృష్టించిన అలజడితో యావత్ దేశం ఉలిక్కిపడింది. ఈ ఘటనతో పార్లమెంట్ భద్రతపై అనేక సందేహాలు తలెత్తాయి. పార్లమెంట్ భవన సముదాయంలో సర్వే చేపట్టాలని కేంద్ర హోంశాఖ ఇప్పటికే ఆదేశించినట్లు ఆ వర్గాలు తెలిపాయి. సర్వే అనంతరం పార్లమెంట్ ప్రాంగణంలో సీఐఎస్ఎఫ్ సిబ్బందిని మోహరిస్తారు. సీఐఎస్ఎఫ్‌కు చెందిన గవర్నమెంట్ బిల్డింగ్ సెక్యూరిటీ యూనిట్ నిపుణులు, ఫైర్ యూనిట్ సభ్యులు ప్రస్తుత పార్లమెంట్ భద్రతా బృందాలతో కలిసి ఈ వారాంతంలో సర్వే చేపట్టనున్నారు. ఈ ప్రక్రియ అనంతరం... పాత, కొత్త పార్లమెంట్ కాంప్లెక్స్‌లు, వాటి అనుబంధ భవనాలన్నింటినీ సీఐఎస్ఎఫ్ ఆధీనంలోకి తీసుకురానున్నట్లు తెలుస్తోంది. దీని కిందే ప్రస్తుతం పార్లమెంట్ వద్ద

- మిగతా 2 లో

సీఈసీ, ఈసీ బిల్లుకు పార్లమెంటు ఆమోదం

2లో

రెజ్లింగ్‌ను వదిలేస్తున్నా

- డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడి ఎన్నికపై సాక్షి మాలిక్ ఆగ్రహం
- మా భవిష్యత్ అంధకారమే: వినేశ్ ఫొగాట్
- హామీ నిలబెట్టుకోని సర్కార్: బజరంగ్ పునియా

న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య ఎన్నికపై మల్లయోధులు తీవ్ర ఆగ్రహం వెలిబుచ్చారు. సమాఖ్య అధ్యక్షుడిగా బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌సింగ్ అనుచరుడు సంజయ్‌సింగ్ ఎన్నికకావడంతో మహిళా రెజ్లర్లు నిరసన

- మిగతా 2 లో

ప్రతిపక్షం బుల్డోజ్

- మోదీ హయాంలో ప్రజాస్వామ్యం ఖూనీ
- విపక్ష ఎంపీల నిరసన యాత్ర
- కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు
- మరో ముగ్గురు ఎంపీలపై వేటు
- మొత్తం 146 మంది విపక్ష ఎంపీల గెంటివేత

న్యూఢిల్లీ: ప్రభుత్వం ప్రజాస్వామ్యయుతంగా ప్రవర్తించాలని 'ఇండియా' కూటమి విపక్ష పార్టీల నేతలు అన్నారు. మోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని, ఎంపీల సస్పెన్షన్లతో ప్రతిపక్షాన్ని 'బుల్డోజ్' చేసిందని విమర్శించారు. ప్రతిపక్ష శాసనసభ్యుల సస్పెన్షన్‌ను నిరసిస్తూ గురువారం 'ఇండియా' కూటమి ఎంపీలు పార్లమెంటు నుంచి విజయ్ చౌక్‌కు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ సభలో భద్రతా ఉల్లంఘన అంశంపై మాట్లాడకుండా పార్లమెంటరీ ప్రత్యేక హక్కును ఉల్లంఘించారని ఆరోపించారు. 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి' అనే భారీ బ్యానర్, 'ప్రతిపక్ష ఎంపీల సస్పెండ్' 'పార్లమెంట్ పంజరం', 'ప్రజాస్వామ్యం బహిష్కరణ' వంటి సందేశాలతో కూడిన ప్లకార్డులను చేతపట్టుకుని పార్లమెంటు సభ్యులు పాదయాత్ర చేపట్టారు. ఇదే సమయంలో సభలో ప్లకార్డులు ప్రదర్శించినందుకుగాను మరో ముగ్గురు ఎంపీలను లోక్‌సభ నుంచి శీతాకాల సమావేశాలు పూర్తయ్యే వరకు సస్పెన్షన్ చేశారు. దీంతో సస్పెన్షన్‌కు గురైన ఎంపీల సంఖ్య 146కి చేరుకుంది. మరోవైపు, తనకు కావాల్సిన బిల్లులను విపక్షాలు లేకుండానే హడావుడిగా ఆమోదింపచేసుకున్న మోదీ సర్కారు...లోక్‌సభను నిరవధికంగా వాయిదా వేసింది. విజయ్ చౌక్‌లో విలేకరులతో మాట్లాడిన ఖడ్గే ప్రజాస్వామ్యంలో మాట్లాడడం

- మిగతా 2 లో

ఇదీ లోకం!

26 తర్వాత ప్రత్యక్షపోరు

- అంగన్‌వాడీల సమ్మెకు వామపక్షాల అండ
- ప్రజలు కూడా మద్దతివ్వాలి
- రామకృష్ణ, శ్రీనివాసరావు, ప్రసాద్ పిలుపు

విశాలాంధ్ర-విజయవాడ: అంగన్‌వాడీల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి పరిష్కరించాలని, లేకపోతే అంగన్‌వాడీలు కొనసాగించే ఉద్యమానికి డిసెంబరు 26 తర్వాత ప్రత్యక్ష మద్దతు ఇవ్వాలని వామపక్ష పార్టీలు నిర్ణయించాయి. స్థానిక సీపీఎం రాష్ట్ర కార్యాలయంలో పదివామపక్ష పార్టీల సమావేశం సీపీఐఎంఎల్ రాష్ట్ర నాయకులు జాస్తి కిషోర్‌బాబు అధ్యక్షతన గురువారం జరిగింది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఓబులేసు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కార్యదర్శివర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు, న్యూడెమోక్రసీ పార్టీల నుండి పి.ప్రసాదు, కె.పొలారి, ఎం.రామకృష్ణ, సీపీఐఎంఎల్ లిబరేషన్ నాయకులు డి.హరినాథ్, ఫార్వర్డ్‌బ్లాక్ నాయకులు పీవీ సుందరరామరాజు, ఆర్ఎస్‌పీ నాయకులు రవికాంత్ హాజరయ్యారు. అంగన్‌వాడీల సమ్మె...ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై నాయకులు చర్చించారు. అనంతరం వామపక్ష పార్టీల తరపున కె.రామకృష్ణ, వి.శ్రీనివాసరావు, పి.ప్రసాదు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమస్యల పరిష్కారం కోసం నెలరోజుల క్రితమే అంగన్‌వాడీలు ప్రభుత్వానికి నోటీసు ఇచ్చారని, అప్పటి నుండి పట్టించుకోకుండా చివరిలో చర్చల పేరుతో

- మిగతా 2 లో

లోక్‌సభ స్థానాలకు సమన్వయకర్తలు

- భావసారూప్యతగల పార్టీలతో పొత్తులు
- సీడబ్ల్యూసీ నిర్ణయం

న్యూఢిల్లీ: లోక్‌సభ స్థానాలకు సమన్వయకర్తలను త్వరలోనే నియమించాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) నిర్ణయించింది. వచ్చే ఎన్నికల్లో భావసారూప్యత గల పార్టీలతో సమన్వయం చేసుకుంటూ వీలైనన్ని ఎక్కువ సీట్లు గెలవాలని నిర్ణయం తీసుకుంది. ఢిల్లీలోని ఏఐసీసీ

- మిగతా 2 లో

గాజాలో ఆకలి కేకలు

గడ్డి తింటున్న ప్రజలు : పస్తులుంటున్న 71శాతం మంది

జెనీవా: గాజాలో ఆకలి కేకలు వినిపిస్తున్నాయి. 98శాతం మందికి సరిపడ ఆహారం అందడంలేదు. చివరకు గడ్డి తిని బతకాల్సిన దయనీయ స్థితి దాపురించింది. 64శాతం మంది పాడైనవి తింటున్నారు. 71శాతం మంది పస్తులు ఉంటున్నారు. తిండిలేక చిన్నారులు స్పృహ కోల్పోతున్నారు. ఇజ్రాయిల్ దాడులు భీకరంగా కొనసాగిస్తూ ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలిపోవాలని వచ్చే హెచ్చరికలతో పరుగులు పెట్టలేక ప్రజలు అలసిపోతున్నారు. తాగునీరు కూడా లేక నీరసించిపోతున్నారు. గాజాపై పోరులో పలస్తీనా ప్రజలను పస్తులు ఉంచి ఇజ్రాయిల్ చంపేస్తోంది. ఈ మేరకు జెనీవాకు చెందిన యూరో-మెడ్ హ్యూమన్ రైట్స్ మానిటర్ అధ్యయనంలో వెల్లడైంది. గాజాలో మానవతా సంక్షోభం తీవ్రతను అధ్యయనం చేసేందుకు ఈ సంస్థ సర్వే నిర్వహించింది. ఇప్పటికే 20వేల మంది పలస్తీనియన్లు ఇజ్రాయిల్ దాడుల్లో చనిపోగా సుమారు 60వేల మంది గాయపడ్డారు. 90శాతం మంది నిర్వాసితులయ్యారు. శిబిరాల్లో అరకొర వసతులతో బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. అక్టోబరు 9 నుంచి ఆహారం, ఇతర నిత్యావసరాలను ఇజ్రాయిల్ నిలిపివేయడంతో ఆహార సంక్షోభం తీవ్రరూపం దాల్చింది.

ఉత్తర గాజాలో పనిచేసే ఆసుపత్రి ఒక్కటీ లేదు: డబ్ల్యూహెచ్ఓ

ఉత్తర గాజాలో ఒక్క ఆసుపత్రి కూడా పనిచేసే పరిస్థితిలో లేదని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) గురువారం తెలిపింది. ఇంధనం, సిబ్బంది, పరికరాలు, మందులు లేక ఆసుపత్రులన్నీ నిర్వీర్యమైనట్లు పేర్కొంది. గాజాలోని 36కుగాను తొమ్మిది ఆసుపత్రులే పనిచేస్తున్నాయని, అవి దక్షిణ గాజాలో ఉన్నాయని తెలిపింది. ఉత్తర గాజాలో ఒక్క ఆసుపత్రి కూడా లేకుండా పోయిందని గాజాకు డబ్ల్యూఓ ప్రతినిధి రిచర్డ్ పీపర్‌కార్న్ తెలిపారు. అల్‌అహ్లీ ఆసుపత్రే చివరి కాగా అక్కడ 10 మంది సిబ్బంది, జూనియర్ వైద్యులు, నర్సులు ప్రాథమిక చికిత్స, నొప్పి తగ్గించే మాత్రలు మాత్రమే ఇవ్వగలుగుతున్నట్లు తెలిపారు. మృతదేహాలు ఆసుపత్రి ఆవరణలో ఉండగా, గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహించే స్థితి లేకపోవడం దారుణమన్నారు. అల్ షిఫా, అల్ అవ్దా, అల్ సహాబా ఆసుపత్రులు కొద్దిపాటి వైద్య సేవలు అందిస్తున్నాయని, వేలాది మంది నిర్వాసితులకు ఆశ్రయం కల్పిస్తున్నాయని పీపర్‌కార్న్ తెలిపారు. యాంటీబయోటిక్స్‌తో పాటు మందులు ఏమీ లేని కారణంగా ఆయా ఆసుపత్రుల్లో కదల్లేని స్థితిలో ఉన్న రోగుల మనుగడ కష్టసాధ్యమంగా మారిందన్నారు.

దీంతో మానవతా కాల్పుల విరమణ అనివార్యమని డబ్ల్యూహెచ్ఓ తరపున ఆయన పునరుద్ఘాటించారు. నరమేధాన్ని తక్షణమే ఆపాలని నొక్కిచెప్పారు. ఇందుకు చర్యలు తీసుకోవాలని ప్రపంచ దేశాలకు డబ్ల్యూహెచ్ఓ పిలుపునిచ్చింది. ఐరాస భద్రతా మండలి గాజాకు అనుకూలంగా తీర్మానం చేయడంతో తాత్సారం చేయడంతో అక్కడ ఇజ్రాయిల్ దాడులు మరింత ఉధృతంగా కొనసాగుతున్న విషయం తెలిసిందే.

అమెరికా కమ్యూనిస్టు నేత ఆల్ఫ్రెడ్ మర్దర్ మృతి

కనెక్టికట్: అమెరికాలో కమ్యూనిస్టు నాయకుడు, శాంతి మండలి సీనియర్ నాయకుడు ఆల్ఫ్రెడ్ మర్దర్ (102) కన్నుమూశారు. మరో నెలలో 102వ పడిలోకి అడుగు పెట్టబోయే సమయంలో మృత్యువు సంభవించడం బాధాకరమని అమెరికా శాంతి మండలి పేర్కొంది. ఆయన మరణించినట్లు ప్రకటించింది. అంతర్జాతీయవాదీ, సామ్రాజ్యవాద వ్యతిరేకి ఆల్ఫ్రెడ్ మర్దర్ ఈనెల 19వ తేదీ రాత్రి తుది శ్వాస విడిచారని ప్రపంచ శాంతి మండలి (డబ్ల్యూపీసీ) ఒక ప్రకటన విడుదల చేసింది. 'అప్పుడైన ఆల్ఫ్రెడ్ మర్దర్ ఇక లేరన్న దుర్వార్తను ప్రకటించాల్సి రావడం బాధాకరం. కనెక్టికట్‌లోని న్యూ హవెన్‌లో ఆయన చనిపోయారు. ఆల్ఫ్రెడ్ అమెరికా శాంతి మండలి సీనియర్ నాయకులు. ప్రెసిడెంట్ ఆఫ్ హానర్ గ్రహీత, నిబద్ధతగల కమ్యూనిస్టు' అని పేర్కొంది. తన జీవితాన్ని శాంతి, సామాజిక న్యాయం కోసం పోరాటాలకు అంకితం చేసిన మహనీయుడని డబ్ల్యూపీసీ కొనియాడింది. అమెరికాతో పాటు ప్రపంచ కార్మికుల హక్కుల సాధన కోసం పోరాడిన యోధుడని శ్లాఘించింది. ఆయన తన ఆశలు, ఆకాంక్షలను ఎన్నడూ విడనాడలేదని, నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడిన కమ్యూనిస్టుగా రాణించారని డబ్ల్యూపీసీ పేర్కొంది. ప్రపంచ శాంతి మండలి పునర్నిర్మాణానికి పాటు పడ్డారని తెలిపింది. డబ్ల్యూపీసీ ఉపాధ్యక్షుడిగా, సెక్రటేరియట్ సభ్యునిగా అనేక సంవత్సరాలు సేవలు అందించారని వెల్లడించింది. ఆల్ఫ్రెడ్ మర్దర్ మరణం తీరని లోటని పేర్కొంది. డబ్ల్యూపీసీకి ఆయన సేవలు భావితరాలకు స్ఫూర్తినిస్తాయని, ఆయన మరణం మిగిల్చిన శూన్యతను ప్రపంచ శాంతి, సామాజిక న్యాయం, సామ్రాజ్యవాదం, దోపిడీ వ్యవస్థలకు వ్యతిరేక పోరాటాలతో భర్తీ చేయాలని డబ్ల్యూపీసీ పేర్కొంది.

రెచ్చగొడితే అణుదాడికి వెనక్కుతగ్గబోం

శత్రుదేశాలకు కిమ్ హెచ్చరిక

ప్యాంగ్యాంగ్: తమను అణ్వస్త్రాలతో రెచ్చగొట్టే దేశాలపై అణు దాడి చేసేందుకు ఏ మాత్రం జంకబోమని ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్ హెచ్చరించారు. ఇటీవల ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి (ఐసీబీఎం) ప్రయోగించిన మిలటరీ మిసైల్ బ్యూరో సైన్యాన్ని కిమ్ గురువారం కలిశారు. ఈ సందర్భంగా శత్రుదేశాలకు కిమ్ హెచ్చరిక చేసినట్లు కేసీఎన్ఏ వార్తాసంస్థ పేర్కొంది. 'పార్టీ యుద్ధ క్రమానికి అనుగుణంగా ఈసారి నిర్వహించిన సైనిక కార్యకలాపాలు దేశ సార్వభౌమత్వాన్ని పరిరక్షించే డీపీఆర్‌కే సాయుధ దళాల విధేయతకు నిదర్శనం. అణు వ్యూహం పరిణామం, డీపీఆర్‌కే సిద్ధాంతం, శత్రువులు అణ్వాయుధాలతో రెచ్చగొట్టినప్పుడు వారిపై అణు దాడికి కూడా వెనుకాడరనే స్పష్టత' అని కిమ్ చెప్పినట్లు వార్తాసంస్థ నివేదించింది. మరోవైపు ఐసీబీఎం ప్రయోగంపై ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి (యూఎన్ఎస్‌సీ) సమావేశం నిర్వహించడాన్ని కిమ్ సోదరి కిమ్ యో జోంగ్ ఖండించారు. స్వీయ సంరక్షణకు తమ దేశానికి ఉన్న హక్కును కాపాడుకునే క్రమంలో చేపట్టిన ప్రయోగమని అన్నారు. భద్రతారాహిత్య వైఖరితో ఉన్న అమెరికా, ఆర్‌ఓకేపై భారీ బాధ్యతను భద్రతా మండలి మోపాలని అన్నారు.

విద్యుత్ ఒప్పందాలపై న్యాయ విచారణ

అసెంబ్లీలో సీఎం రేవంత్ ప్రకటన

విశాలాంధ్ర-హైదరాబాద్ : గత పాలకులు వాస్తవాలను హుందాగా ఒప్పుకుంటే మంచిదని, అంతేకాని ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకులు ఎదురుదాడి చేసేందుకు ప్రయత్నిస్తామంటే సరికాదని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గత తొమ్మిదిన్నర ఏళ్లలో వారు ఏనాడూ వాస్తవాలను శాసనసభలో పెట్టిన దాఖలాలు లేవని ఆయన విమర్శించారు. కానీ తాము ఒక్కో శాఖను స్కాన్ చేసి మరీ వాస్తవాలను సభలో అందరి ముందు పెడుతున్నామని చెప్పారు. గురువారం శాసనసభలో విద్యుత్ శాఖపై జరిగిన లఘు చర్చ సందర్భంగా సీఎం మాట్లాడుతూ విద్యుత్ శాఖ మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి వ్యాఖ్యలను తాము స్వాగతిస్తున్నామని, విద్యుత్ శాఖలో మూడు అంశాలపై న్యాయ విచారణకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. చత్తీస్‌గఢ్‌తో టెండర్లు లేకుండా ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు. ఆ ఒప్పందంపై ఆనాడే తాము పోరాటం చేస్తే తమను మార్షల్స్‌తో సభ నుంచి బయటకు పంపారని గుర్తు చేశారు. చత్తీస్‌గఢ్ ఒప్పందంపై ఒక అధికారి నిజాలు చెబితే, ఆ ఉద్యోగికి డిమోషన్ ఇచ్చి మారుమూల ప్రాంతాలకు బదిలీ చేసిన మాట వాస్తవం కాదా అని నిలదీశారు. చత్తీస్‌గఢ్‌తో 1,000 మెగావాట్ల ఒప్పందం చేసుకోవడం వల్ల ప్రభుత్వంపై రూ.1,362 కోట్ల భారం పడిందని తెలిపారు. చత్తీస్‌గఢ్ ఒప్పందాలపై న్యాయ విచారణకు ఆదేశిస్తామని సభాముఖంగా వెల్లడించారు. అలాగే యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టు కాలం చెల్లిన సంస్థతో ఒప్పందం చేసుకున్నారని దుయ్యబట్టారు. సబ్ క్రిటికల్ టెక్నాలజీకి కాలం చెల్లినా దాన్ని ఉపయోగించి ప్రభుత్వానికి నష్టం చేశారని, భద్రాద్రి పవర్ ప్రాజెక్టులో వేల కోట్ల అవినీతి జరిగిందని మండిపడ్డారు. భద్రాద్రి, యాదాద్రి పవర్ ప్రాజెక్టుపై కూడా న్యాయ విచారణ చేస్తామని చెప్పారు. 24 గంటల విద్యుత్ సరఫరా అంశంపై అఖిలపక్షంతో నిజనిర్ధారణ కమిటీ వేద్దామని అన్నారు. న్యాయ విచారణ చేయాలన్న మాజీ మంత్రి కోరిక మేరకు విచారణ చేయాలని తాను ఆదేశాలిస్తున్నానని సీఎం తెలిపారు.

ప్రతి నిర్ణయం పారదర్శకంగా ఉండాల్సిందే

సాగు నీటి రంగానికి సంబంధించి ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయం పారదర్శకంగా ఉండాల్సిందేనని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఆయన తన నివాసంలో వ్యవసాయ, నీటిపారుదల రంగాలపై మంత్రులు తుమ్మల, ఉత్తమ్‌కుమార్ రెడ్డితో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ : అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించి, సమ్మెను విరమింపజేయాలని వక్తలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల సమ్మెకు సంఘీభావంగా ఉభయ ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘాల అధ్వర్యంలో వ్యవసాయ కార్మిక, వృత్తి, సామాజిక సంఘాలతో విస్తృత స్థాయి రౌండ్ టేబుల్ సమావేశం గురువారం స్థానిక బాలోత్సవ భవన్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్మికుల న్యాయమైన కోరికలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల వల్ల 90 శాతం వ్యవసాయ కార్మికులు, పేద కుటుంబాల పిల్లలే లబ్ధి పొందుతున్నారని తెలిపారు. కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాల్సిన బాధ్యత పాలకులకు ఉందన్నారు. చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా లక్షా మూడు వేల మంది అంగన్‌వాడీ కార్మికులు డిసెంబరు 12 నుంచి సామరస్యంగా నిరవధిక సమ్మె చేస్తున్నారని తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించాల్సి రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధం ప్రయోగించడాన్ని ఖండించారు. ప్రభుత్వం ఇదే పద్ధతి కొనసాగిస్తే వ్యవసాయ కార్మికులు, పేదలు ఈ పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొంటారని హెచ్చరించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఐసీడీఎస్ ప్రాజెక్టుకు నిధులు తగ్గించి అంగన్‌వాడీ రంగాన్ని ప్రైవేటీకరించాలని ప్రయత్నిస్తోందన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు దడాల సుబ్బారావు మాట్లాడుతూ చాలీచాలని వేతనంతో అంగన్‌వాడీ కార్మికులు జీవనం సాగించటం కష్టమన్నారు. కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేవీపీఎస్ రాష్ట్ర నాయకులు జి.నటరాజ్, వ్యవసాయ కార్మిక నాయకులు వి.రాణి, కోట కళ్యాణ్ మద్దతు తెలియజేస్తూ ప్రసంగించారు. అనంతరం ధర్నాచౌక్ వరకు ప్రదర్శనగా వెళ్లి అంగన్‌వాడీ వర్కర్ల సమ్మెకు సంఘీభావం తెలిపారు.

సీఈసీ, ఈసీ బిల్లుకు పార్లమెంటు ఆమోదం

న్యూఢిల్లీ: ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్ల నియామకాల నియంత్రణతో పాటు వారి సర్వీసులకు నిబంధనలు రూపొందించే బిల్లుకు పార్లమెంటు ఆమోదం లభించింది. 'ది చీఫ్ ఎలక్షన్ కమిషనర్, అండ్ అదర్ ఎలక్షన్ కమిషనర్స్ (అపాయింట్‌మెంట్, కండీషన్స్ ఆఫ్ సర్వీస్ అండ్ టెర్మ్ ఆఫ్ ఆఫీస్) బిల్లు- 2023'ను స్వల్పకాలిక చర్చ అనంతరం లోక్‌సభ గురువారం ఆమోదించింది. ఈ బిల్లుకు ఇప్పటికే రాజ్యసభ ఆమోదం లభించింది. దీంతో దీనికి చట్టరూపం రావడానికి రాష్ట్రపతి సంతకమే మిగిలి ఉంది. ఇప్పటివరకు సీఈసీ, ఈసీలను ప్రభుత్వమే నియమించేది. కొత్త బిల్లు ప్రకారం... ఇక నుంచీ సెర్చ్, ఎంపిక కమిటీలు ఈ బాధ్యతలు నిర్వహించనున్నాయి. ఎన్నికల కమిషనర్ల నియామకాలకు సంబంధించిన నిబంధనలు లేవని పేర్కొంటూ 1991 నాటి చట్టం స్థానంలో కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లు తెచ్చింది. ప్రస్తుతమున్న చట్టంలోని లోపాలను సరిదిద్ది కొత్త బిల్లు తీసుకొచ్చామని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ వెల్లడించారు. ఈ ఏడాది మార్చిలో సీఈసీ, ఈసీల నియామకాలపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పునకు అనుగుణంగా ఈ బిల్లు ఉందని వివరించారు. రాజ్యాంగంలో పేర్కొన్నట్లుగా అధికారాల విభజనకు అనుగుణంగా రూపొందించామని తెలిపారు. సీఈసీ, ఇతర ఎన్నికల కమిషనర్ల హోదా, వేతనాలకు సంబంధించిన సవరణలూ ఇందులో పొందుపర్చారు.

పార్లమెంట్ భద్రత బాధ్యత ఇక సీఐఎస్ఎఫ్‌దే

(మొదటిపేజీ తరువాయి)

భద్రతను పర్యవేక్షిస్తున్న పార్లమెంట్ సెక్యూరిటీ సర్వీస్, ఢిల్లీ పోలీసు, సీఆర్పీఎఫ్‌కు చెందిన పార్లమెంట్ డ్యూటీ గ్రూప్ బృందాలు పనిచేయనున్నట్లు ఆ వర్గాలు వెల్లడించాయి. సీఐఎస్ఎఫ్ అనేది... కేంద్ర సాయుధ పోలీసు దళం. ప్రస్తుతం ఈ దళం ఢిల్లీలోని అనేక కేంద్ర మంత్రిత్వ శాఖల భవనాలతో పాటు అణు, ఏరోస్పేస్ డొమైన్, సివిల్ ఎయిర్‌పోర్టులు, ఢిల్లీ మెట్రో వద్ద భద్రత కల్పిస్తోంది. డిసెంబరు 13న పార్లమెంట్‌లో చోటుచేసుకున్న భద్రతా వైఫల్యం ఘటన తీవ్ర కలకలం రేపిన విషయం తెలిసిందే. లోక్‌సభలో జీరో అవర్ జరుగుతుండగా ఇద్దరు దుండగులు విజిటర్స్ గ్యాలరీలో నుంచి సభలోకి దూకి గందరగోళం సృష్టించారు. రంగుల పొగ వెదజల్లారు. అదే సమయంలో పార్లమెంట్ భవనం వెలుపల ఇద్దరు పొగ గొట్టాలతో ఆందోళన చేశారు. దీంతో అప్రమత్తమైన భద్రతా బలగాలు వారందరినీ అదుపులోకి తీసుకున్నాయి. ఈ ఘటనపై ముమ్మర దర్యాప్తు కొనసాగుతోంది.

ఓట్ల అక్రమాలపై కదలిక

(మొదటిపేజీ తరువాయి)

నిబంధనలు వర్తిస్తాయి. మున్సిపల్ కార్పొరేషన్లు, అభివృద్ధి మండళ్లకు ఈ నిబంధనలు వర్తిస్తాయి. అదనపు డైరెక్టర్ జనరల్ స్థాయి నుంచి పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్ స్థాయి వరకూ ఈ నిబంధనలే వర్తింపజేయాలి. బదిలీలు, పోస్టింగ్‌లకు సంబంధించిన నివేదికను 2024 జనవరి 31లోగా ఎన్నికల కమిషన్‌కు సమర్పించాలని ఆదేశించింది.

అధికారులపై చర్యలేవి: ఎంపీ గల్లా

ఆంధ్ర ప్రదేశ్ ఓటర్ల జాబితాలో అక్రమాలపై పార్లమెంటులో టీడీపీ ఎంపీ గల్లా జయదేవ్ గురువారం గళం విప్పారు. కేంద్ర ఎన్నికల కమిషనర్ల నియామకం, విధివిధానాల బిల్లుపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు ఏపీలో ఎక్కడా సరిగ్గా అమలు కావడం లేదు. ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించడం ఈసీ ప్రధాన విధి. కానీ రాష్ట్రంలో ఆ విధమైన పరిస్థితి కనిపించడం లేదు. క్షేత్రస్థాయిలో పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. ఓటర్ల జాబితాను పారదర్శకంగా రూపొందించే విషయంలో ఈసీ ఇచ్చిన ఆదేశాలను డీఆర్‌వోలు, స్థానిక సిబ్బంది ఏమాత్రం పరిగణనలోకి తీసుకోవడం లేదు. ఒత్తిళ్లకు లొంగి జాబితాలో మార్పులు చేస్తున్నారు. ఓటర్ల జాబితా నుంచి టీడీపీ సానుభూతిపరులు, కార్యకర్తల ఓట్లు తొలగిస్తున్నారని ఆధారాలతో ఫిర్యాదు చేశారు. ఇప్పటివరకు సుమారు 10 లక్షల ఫిర్యాదులు చేసినా వాటిని ఈసీ పట్టించుకోలేదు. తుది ముసాయిదా జాబితా విడుదల చేసిన సందర్భంలో 13 లక్షలకు పైగా దొంగ ఓట్లు ఉన్నాయని గుర్తించినట్లు ఎన్నికల సంఘం అధికారులు చెప్పారు. దొంగ ఓట్లు ఉన్నాయని అధికారికంగా ప్రకటించిన తర్వాత కూడా వారిపై చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ఇకనైనా జోక్యం చేసుకుని పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపొందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీ గల్లా కోరారు.

ప్రతిపక్షం బుల్డోజ్

(మొదటిపేజీ తరువాయి)

ప్రతిపక్షాల హక్కు అని, ప్రజాప్రతినిధులుగా పార్లమెంటులో ప్రజల మనోభావాలను తెలియజేయడం ఎంపీల బాధ్యత అని అన్నారు. ప్రతిపక్షాలు ఈ అంశంపై మాట్లాడాలని భావించాయని, అయితే ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా లోక్‌సభకు లేదా రాజ్యసభకు కూడా రాలేదని, ప్రధాన మంత్రి ఇతర చోట్ల ప్రసంగాలు చేస్తూనే ఉన్నారని ఖర్గే అన్నారు. 'ఇది ఎందుకు జరిగింది. ఎవరు బాధ్యులు అనే దానిపై మేము పార్లమెంటు భద్రతా ఉల్లంఘన సమస్యను లేవనెత్తాలనుకుంటున్నాము' అని ఖర్గే స్పష్టం చేశారు. 'పార్లమెంటు ఒక పెద్ద పంచాయతీ. పార్లమెంటులో ఒకరు మాట్లాడకపోతే ఎక్కడ మాట్లాడతారు. భద్రతా లోపాలను వివరించేందుకు హోం మంత్రి షా, ప్రధాని మోదీ సభకు రాకపోవడం విచారకరం. సభలో మాట్లాడవలసిన అంశాలను వారు బయట మాట్లాడారు. 'అతను (మోదీ) వారణాసి, అహ్మదాబాద్ నగరాల్లో టీవీలో మాట్లాడతాడు. పార్లమెంటులో మాట్లాడడు. సభను అగౌరవపరిచారు. ముందుగా లోక్‌సభకు, రాజ్యసభకు వచ్చి మాట్లాడాలి. దానికి బదులు బయట మాట్లాడుతున్నాడు. ఇది ఖండించదగినది. సభా హక్కుల అధికారాన్ని ఉల్లంఘించడమే' అని విమర్శించారు. భద్రతా ఉల్లంఘన అంశంపై మాట్లాడేందుకు చట్టసభ సభ్యులను అనుమతించాలని ప్రతిపక్ష ఎంపీలు రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్కర్‌ను లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను పదే పదే అభ్యర్థిస్తున్నారని, అధికార పక్ష సభ్యులు సభా కార్యకలాపాలకు ఆటంకం కలిగిస్తున్నారని ఖర్గే ఆరోపించారు. ప్రజాస్వామ్యంపై బీజేపీకి విశ్వాసం లేదని, చర్చలు అక్కర్లేదని దీన్ని బట్టి తెలుస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు అన్నారు. 'ప్రజాస్వామ్యయుతంగా ప్రవర్తించాలి' అని ప్రభుత్వాన్ని కోరారు. ఎంపీల సస్పెన్షన్‌కు వ్యతిరేకంగా డిసెంబరు 22న జంతర్ మంతర్ వద్ద భారత కూటమి నాయకులు నిరసన తెలుపుతారని, ఈ ప్రభుత్వ అనైతిక, చట్టవిరుద్ధమైన ప్రవర్తనకు వ్యతిరేకంగా అన్ని జిల్లా ప్రధాన కార్యాలయాల్లో దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని రాజ్యసభలో ప్రతిపక్ష నేత తెలిపారు. లోక్‌సభలో కాంగ్రెస్ నాయకుడు అధిర్ రంజన్ చౌదరి, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్, నేషనల్ కాన్ఫరెన్స్‌కు చెందిన హస్నైన్ మసూది, జేఎంఎంకు చెందిన మహువా మాజీ, సమాజ్‌వాదీ పార్టీకి చెందిన ఎస్.టి.హసన్ విజయ్ చౌక్‌లో ఖర్గే ఈ వ్యాఖ్యలు చేస్తుండగా ఆయన పక్కనే ఉన్నారు. మిమిక్రీ వ్యవహారం, దానిపై ఉపరాష్ట్రపతి ధన్కర్ చేసిన వ్యాఖ్యలను స్పష్టంగా ప్రస్తావించిన ఖర్గే, 'రాజ్యసభ ఛైర్మన్ ఒక సమస్యను లేవనెత్తడం ద్వారా పార్లమెంటుకు కులతత్వాన్ని తీసుకువచ్చారని చెప్పడానికి నేను చింతిస్తున్నాను' అని తెలిపారు. ఎంపీల సస్పెన్షన్‌కు వ్యతిరేకంగా పార్లమెంటు మెట్లపై ప్రతిపక్షాలు చేస్తున్న నిరసన సందర్భంగా తృణమూల్ కాంగ్రెస్ నాయకుడు కళ్యాణ్ బెనర్జీ.... ధన్కర్‌ను సరదాగా అనుకరించడంతో మంగళవారం రాజకీయ వివాదం చెలరేగింది. తన రైతు, జాట్ సామాజిక వర్గ నేపథ్యాలను లక్ష్యంగా చేసుకున్నందుకు తాను వ్యక్తిగతంగా బాధపడ్డానని ధన్కర్ రాజ్యసభలో తన వేదనను బయటపెట్టారు. నిరసన ప్రదర్శన తర్వాత ఖర్గే తన 'ఎక్స్' పోస్ట్‌లో 'భారతదేశ ప్రజలమైన మనం ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి. ప్రతిపక్ష ఎంపీలను సస్పెండ్ చేయడం ద్వారా ముఖ్యమైన చట్టాలను ఆమోదించడం ప్రజాస్వామ్యం కాదు. ఇది అత్యంత నీచమైన నిరంకుశత్వం. ఇప్పుడు ఈ నియంతృత్వానికి వ్యతిరేకంగా గళం విప్పకపోతే మన భవిష్యత్ తరాలు క్షమించవు!' అని ఆయన పేర్కొన్నారు. ఇదిలాఉండగా, డిసెంబరు 21 గురువారం నాటికి మొత్తం 146 మంది ప్రతిపక్ష ఎంపీలను పార్లమెంటు ఉభయ సభల నుంచి సస్పెండ్ చేశారు. మంగళవారం లోక్‌సభలో 49 మంది ఎంపీలను సస్పెండ్ చేయగా, సోమవారం 78 మందిని సస్పెండ్ చేశారు. సోమవారం నాటి సస్పెన్షన్‌లో లోక్‌సభలో 33 మంది, రాజ్యసభలో 45 మంది ఉన్నారు. గురువారం మొత్తం 14 మంది ఎంపీలు (లోక్‌సభలో 13 మంది, రాజ్యసభలో ఒకరు) సస్పెండ్ అయ్యారు. బుధవారం మరో ఇద్దరు లోక్‌సభ ఎంపీలను సస్పెండ్ చేశారు. గురువారం దిగువ సభలో మరో ముగ్గురిని సస్పెండ్ చేశారు. ఇప్పటి వరకు విపక్షాలకు చెందిన 100 మంది ఎంపీలు లోక్‌సభ నుంచి, 46 మంది రాజ్యసభ నుంచి సస్పెండ్ అయ్యారు. డిసెంబరు 13న ఇద్దరు వ్యక్తులు లోక్‌సభ ఛాంబర్‌లోకి దూకి, డబ్బాల నుంచి పొగను విడుదల చేసిన తర్వాత, భద్రతా ఉల్లంఘనపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగిస్తున్నాయి.

లోక్‌సభ స్థానాలకు సమన్వయకర్తలు

(మొదటిపేజీ తరువాయి)

కార్యాలయంలో గురువారం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన సీడబ్ల్యూసీ సమావేశం జరిగింది. దేశ రాజకీయాలు, ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు, భవిష్యత్ ఎన్నికల వ్యూహాలు, పార్లమెంటులో కేంద్ర వైఖరీ తదితర అంశాలపై నాలుగు గంటల పాటు చర్చ జరిగింది. వివిధ రాష్ట్రాల్లో సీట్ల సర్దుబాటుపై ఈనెల 19న ఐదుగురు సభ్యులతో కూడిన జాతీయ కమిటీని ఏఐసీసీ ఏర్పాటు చేసుకుంది. ఈ కమిటీ ఇతర పార్టీలతో పొత్తులను నిర్ణయిస్తుంది. కమిటీలో కన్వీనర్లుగా భూపేశ్ బాఘెల్, అశోక్ గెహ్లాట్, ముకుల్ వాసినిక్, సల్మాన్ ఖుర్షీద్, మోహన్ ప్రకాశ్ ఉన్నారు. సీడబ్ల్యూసీ సమావేశంలో సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, చిదంబరం, అధిర్ రంజన్ చౌదరి, దిగ్విజయ్ సింగ్, మీరా కుమారి, అజయ్ మాకెన్, మాణిక్కం ఠాగూర్, రఘువీరారెడ్డి, పల్లం రాజు, కొప్పుల రాజు, టి సుబ్బిరామిరెడ్డి, సీడబ్ల్యూసీ సభ్యులు, శాశ్వత-ప్రత్యేక ఆహ్వానితులు పాల్గొన్నారు. సమావేశంలో ఖర్గే మాట్లాడుతూ పార్లమెంటు ఉభయ సభలకు చెందిన 143 మంది ఎంపీలను సస్పెండ్ చేసిన తీరును దుయ్యబట్టారు. ఎంపీలకు రక్షణ కల్పించాల్సిన వారు (సభాపతులు ఓంబిర్లా, జగదీప్ ధన్కర్‌నుద్దేశించి) తమ రాజ్యాంగబద్ధ విధుల నిర్వహణలో విఫలమయ్యారని విమర్శించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో విలువైన పాఠాలను తమ పార్టీ నేర్చుకుందని ఖర్గే అన్నారు. ఇక 2024 లోక్‌సభ ఎన్నికలపై పూర్తిగా దృష్టిని కేంద్రీకరించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఒక్క తెలంగాణ మినహా అన్ని రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రదర్శన నిరాశపర్చిందని, తమ వైఫల్యంపై ఆత్మవిమర్శను పార్టీ చేసుకుందని చెప్పారు. ఫలితాలు ఎలా ఉన్నాగానీ కొన్ని సానుకూల పరిణామాలు ఉన్నట్లు తెలిపారు. చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, మిజోరంలో ఆశించిన ఫలితాలు రాకపోయినా ఓటుశాతం పెరిగిందని, భవిష్యత్‌లో తమ కష్టానికి తగిన ఫలితం వస్తుందన్న నమ్మకాన్ని ఇది కలిగిస్తుందని ఖర్గే అన్నారు. చేసిన తప్పులు మళ్లీ చేయకుండా జాగ్రత్త పడదామన్నారు. తెలంగాణ ప్రజలు తమ పార్టీకి పట్టం కట్టారని, వారి ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. 'ఐదుగురు సభ్యులతో కూడిన జాతీయ కూటమి కమిటీని ఏర్పాటు చేశాం. ఇది ఇతర పార్టీలతో పొత్తుతో రూపురేఖలను నిర్ణయిస్తుంది. త్వరలో లోక్‌సభ స్థానాలపై సమన్వయకర్తలను కూడా నియమిస్తాం. ఈనెల 28న కాంగ్రెస్ 138వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా నాగపూర్‌లో భారీర్యాలీ నిర్వహించబోతున్నాం' అని ఖర్గే అన్నారు. చర్చలు లేకుండా ముఖ్యమైన బిల్లులను ఇష్టారాజ్యంగా ఆమోదిస్తూ ప్రజాస్వామ్యం గొంతు నొక్కేస్తున్న బీజేపీని దేశం మొత్తం చూస్తోందన్నారు. పార్లమెంటును అధికార పార్టీకి వేదికగా మార్చే కుట్ర జరుగుతోందని దుయ్యబట్టారు. ప్రతిపక్షాలు లేకుండా కీలక బిల్లులన్నింటినీ ఆమోదిస్తూ పార్లమెంటు గౌరవాన్ని మంటగలుపుతోందని ఖర్గే విమర్శించారు.

26 తర్వాత ప్రత్యక్షపోరు

(మొదటిపేజీ తరువాయి)

కాలయాపనకు ప్రయత్నించిందని, అందులో చిన్న చిన్న అంశాలపై సానుకూలంగా స్పందించినా వాటికీ జీఓ ఇవ్వడంలో పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించిందని నాయకులు విమర్శించారు. అక్కచెల్లెమ్మల సంక్షేమమని చెబుతున్న సీఎం... ఆచరణలో తీవ్ర అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. గ్రాట్యుటీ, వేతనం పెంపు గురించి నోరెత్తడం లేదని, పైగా ప్రభుత్వ సిబ్బంది మధ్య ఘర్షణ వాతావరణం సృష్టిస్తోందని పేర్కొన్నారు. జగన్ పుట్టినరోజు సందర్భంగానైనా సమస్యలు పరిష్కరిస్తారని అంగన్‌వాడీలు ఎదురు చూస్తున్నారని, వారి ఆశను నిరాశ చేయొద్దని సూచించారు. రూ.525 కోట్లు ఖర్చు చేసి సీఎం జగన్ అతిథిగృహం నిర్మించుకున్నారని, అంగన్‌వాడీలు అడిగిన జీతాలు పెంచితే ఏడాది మొత్తం అయ్యేదానిలో ఇందులో సగమే ఉంటుందని వివరించారు. భవనాలపై ఉన్న శ్రద్ధ లక్షమంది అంగన్‌వాడీ మహిళలపై లేదని మండిపడ్డారు. రూ.20 వేల కోట్లతో ఎవరూ కోరకపోయినా, వద్దంటున్నా స్మార్ట్ మీటర్లు పెడుతున్నారని, దానివల్ల షిర్డిసాయి ఎలక్ట్రికల్స్, అదానీకి లబ్ధి కలిగించడం, మోదీని సంతృప్తిపరచడం వైసీపీ ప్రభుత్వం లక్ష్యంగా కనిపిస్తోందన్నారు. తనను గెలిపించిన మహిళల సంక్షేమాన్ని మాత్రం సీఎం పట్టించుకోవడం లేదని విమర్శించారు. అంగన్‌వాడీల విషయంలో ప్రభుత్వ విధానం ఏమిటో తెలపాలని నాయకులు డిమాండు చేశారు. 25 నుండి సమ్మెను ఉధృతం చేస్తామని అంగన్‌వాడీలు చెబుతున్నారని, ఆలోగా సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వేతనాలు పెంచాలని కోరితే అప్పుల్లో ఉన్నామని చెబుతున్నారని, అంగన్‌వాడీల కోసం కొంత అప్పుచేస్తే ఎవరైనా వద్దన్నారా అని ప్రశ్నించారు. వేలకోట్లు కార్పొరేట్ల శక్తులకు కట్టబెట్టడం మానుకుంటే...అంగన్‌వాడీల వేతనాలు పెంచవచ్చని సూచించారు. అంగన్‌వాడీలు ఆందోళన చేస్తున్నా పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం...వలంటీర్ల గౌరవ వేతనం పెంచుతున్నట్లు ప్రకటించిందని, ఇది ముమ్మాటికీ అంగన్‌వాడీలను కవ్వించడమేనన్నారు. 30 లక్షల కుటుంబాల్లో పిల్లలకు తల్లులుగా మారిన అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు.

ప్రజాస్వామ్యానికి ప్రమాదం

పార్లమెంటులో 146 మంది ఎంపీలను సస్పెండ్ చేయడం ప్రజాస్వామ్యానికి ప్రమాదమని రామకృష్ణ, శ్రీనివాసరావు చెప్పారు. బీజేపీ ఎంపీ సిఫార్సు లేఖతో అగంతకులు పార్లమెంటులో దూకారని, దానిపై సమాధానం చెప్పాలని అడిగితే ఎంపీలను సస్పెండ్ చేయడం అప్రజాస్వామికమన్నారు. సస్పెన్షన్లను వామపక్ష పార్టీలు తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. ప్రతిపక్ష ఇండియా కూటమి పిలుపు మేరకు 22వ తేదీన వామపక్ష పార్టీలు రాష్ట్రంలో ఆందోళనలు చేస్తున్నట్లు తెలిపారు.

రెజ్లింగ్‌ను వదిలేస్తున్నా

(మొదటిపేజీ తరువాయి)



గళం వినిపంచారు. ఇక నుంచి తాను రెజ్లింగ్‌లో పాల్గొనేది లేదని సాక్షి మాలిక్ స్పష్టం చేయగా...తమ భవిష్యత్ అంధకారమేనని వినీశ్ ఫొగాట్ భావోద్వేగానికి గురయ్యారు. మోదీ సర్కారు హామీని నిలబెట్టుకోలేదని బజరంగ్ పునియా విమర్శించారు. కాగా, భారత రెజ్లింగ్ సమాఖ్య మాజీ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ సింగ్‌కు వ్యతిరేకంగా ఈ ఏడాది ఆరంభంలో జరిగిన మహిళా రెజ్లర్ల ఆందోళన దేశాన్ని కుదిపివేసింది. దీంతో వివాదంలో చిక్కుకున్న భారత రెజ్లింగ్ సమాఖ్య(డబ్ల్యూఎఫ్ఐ)కు ఎట్టకేలకు ఎన్నికలు జరిగాయి. కొత్త అధ్యక్షుడొస్తే మెరుగైన రక్షణ లభిస్తుందని ఆశించిన మహిళా క్రీడాకారులకు నిరాశ ఎదురైంది. బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ సన్నిహితుడు సంజయ్ సింగ్ డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. దీంతో రెజ్లింగ్‌ను వదిలేస్తున్నానని స్టార్ రెజ్లర్ సాక్షి మాలిక్ ప్రకటించారు. వినీశ్ ఫొగాట్, బజరంగ్ పునియా కూడా మీడియాతో మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు. ఫొగాట్ కన్నీళ్లు పెట్టుకున్నారు. మహిళా రెజ్లర్లకు వేధింపులు కొనసాగుతాయని ఆవేదన వ్యక్తంచేశారు. దేశంలో న్యాయాన్ని ఎలా వెతుక్కోవాలో అర్థం కావడం లేదన్నారు. రెజ్లింగ్‌లో తమ భవిష్యత్ అంధకారమైందని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని పూనియా వ్యాఖ్యానించారు. మహిళా అధ్యక్షురాలు రావాలని కోరుకున్నాం కానీ అది జరగలేదని సాక్షి మాలిక్ అన్నారు. గురువారం జరిగిన డబ్ల్యూఎఫ్ ఎన్నికల్లో 47కుగాను 40 ఓట్లు సంజయ్ సింగ్‌కు వచ్చాయి. కామన్‌వెల్త్ స్వర్ణపతక విజేత, రెజ్లర్ అనితా శ్యోరాణ్‌పై ఆయన విజయం సాధించారు. భారత స్టార్ రెజ్లర్ల మద్దతుతో అనితా ఈ ఎన్నికల్లో పోటీ చేశారు. 'బ్రిజ్‌భూషణ్ సింగ్ వ్యాపార భాగస్వామి, సన్నిహితుడు డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడిగా ఎన్నికైతే నేనిక రెజ్లింగ్ చేయను' అని సాక్షి మాలిక్ ప్రకటించారు. తన బూట్లను తీసి టేబుల్‌పై పెట్టేశారు. జనవరిలో బ్రిజ్ భూషణ్ నుంచి ఎదురైన లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా మహిళా రెజ్లర్లు ఆందోళన చేశారు. ఆయనపై చర్యలకు డిమాండ్ చేశారు. దీంతో డబ్ల్యూఎఫ్ఐ పాలక వర్గాన్ని సస్పెండ్ చేసి, సమాఖ్య రోజువారీ వ్యవహారాల పర్యవేక్షణ కోసం భారత ఒలింపిక్ సంఘం అడ్‌హాక్ కమిటీని క్రీడా మంత్రిత్వశాఖ ఏర్పాటు చేసింది.

ఈ కమిటీ ఎన్నికల నిర్వహణ కోసం ప్రయత్నించగా కోర్టు కేసులతో కుదరలేదు. నిర్దేశిత గడువులోగా ఎన్నికలు జరగకపోవడంతో డబ్ల్యూఎఫ్ఐపై యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ ఫెడరేషన్ నిషేధం విధించింది. ఈ సమయంలో ఎన్నికలు నిర్వహించకుండా పంజాబ్, హరియాణా హైకోర్టు విధించిన స్టేను సుప్రీంకోర్టు ఎత్తివేసింది. దీంతో ఎన్నికలకు మార్గం సుగమమైంది. ఎన్నికలు జరుగగా సంజయ్ సింగ్ ఎన్నికయ్యారు. ఆయన ఉత్తరప్రదేశ్ రెజ్లింగ్ సమాఖ్య ఉపాధ్యక్షుడు. డబ్ల్యూఎఫ్ఐకి సంయుక్త కార్యదర్శిగానూ పనిచేశారు. తన ఎన్నికపై సంజయ్ సింగ్ మాట్లాడుతూ సత్యమే గెలిచింది... తప్పు చేయని వ్యక్తిపై అభాండాలు వేశారని బ్రిజ్‌భూషణ్‌ను సమర్థించారు. ఆయనతో తనకున్న సాన్నిహిత్యం గురించి మాట్లాడారు. తన నాయకత్వంలో మహిళా రెజ్లర్లకు అన్యాయం జరగబోదని చెప్పారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దింపుదాం

ముప్పాళ్ల నాగేశ్వరరావు పిలుపు

విశాలాంధ్ర- తాడేపల్లిగూడెం: ప్రజా సమస్యల పరిష్కారంలో విఫలమైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఇంటికి సాగనంపాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, పశ్చిమగోదావరి జిల్లా ఇన్‌చార్జి ముప్పాళ్ల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం కపర్థి భవన్‌లో గురువారం సీపీఐ జిల్లాస్థాయి గ్రామ శాఖ కార్యదర్శుల వర్క్‌షాప్ కలిశెట్టి వెంకట్రావు అధ్యక్షతన జరిగింది. తొలుత పార్టీ పతాకాన్ని సీనియర్ సభ్యులు జోషి ఆవిష్కరించారు. ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గద్దెనెక్కిన నాటి నుండి ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ఘోరంగా విఫలమయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను అధికారం చేపట్టగానే ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని నరేంద్రమోడీ నమ్మబలికి...అధికారం చేపట్టిన తర్వాత నిరుద్యోగులను మోసం చేశారని విమర్శించారు. ఎన్నో పోరాటాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా విభజించి కార్మిక వర్గానికి తీవ్ర నష్టం కలిగించారని మండిపడ్డారు. దేశ రక్షణలో మోదీ సర్కారు పూర్తిగా విఫలమైందని, ఇందుకు లోక్‌సభ ఘటనే నిదర్శన మన్నారు. పార్లమెంటు ఘటనకు బాధ్యులను కఠినంగా శిక్షించాలని ఆందోళన చేస్తున్న 146 మంది ప్రతిపక్ష ఎంపీలను నిర్ధాక్షిణ్యంగా సస్పెండ్ చేశారని, ఇది అత్యంత దారుణమని ముప్పాళ్ల అన్నారు. జగన్ ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టడంతో రాష్ట్రాభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు. ఏపీని రాజధాని లేని రాష్ట్రంగా చేశారని, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం కేంద్రాన్ని నిలదీయలేని నిస్సహాయ స్థితిలో జగన్ ఉన్నారని ఆరోపించారు. కేసులకు భయపడి విభజన హామీలను మోదీ వద్ద జగన్ తాకట్టు పెట్టారని విమర్శించారు. రాష్ట్రంలో నిరుద్యోగం విలయతాండవం చేస్తోందని, జాబ్ క్యాలెండర్ ఊసే లేదన్నారు. ఈ పరిస్థితుల్లో రానున్న ఎన్నికలలో మోదీ, జగన్ ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెప్పాలని ముప్పాళ్ల పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ జిల్లాలో సీపీఐ బలోపేతం కోసం పార్టీ శ్రేణులు ఉద్యమించాలన్నారు. సీపీఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ నెల 26 తేదీన వాడవాడలా అరుణ పతాకావిష్కరణలు చేయాలని విజ్ఞప్తి చేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళింగ లక్ష్మణరావు, బొద్దాని నాగరాజు, ఎం.సీతారాం ప్రసాద్, చెల్లుబోయిన రంగారావు, టి.అప్పలస్వామి, తాడేపల్లి గూడెం పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరరావు, ఎం.లక్ష్మిపతి, నామన వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్లు పరిష్కరిస్తాం... విధులకు రండి

అంగన్వాడీలతో మంత్రి ఉషశ్రీ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్ల డిమాండ్లను పరిష్కరించేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని రాష్ట్ర స్త్రీ, శిశు, సంక్షేమశాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ తెలిపారు. బాలింతలు, గర్భిణులకు ఇబ్బంది కలిగించవద్దని, నిరసనను విరమించి విధుల్లో చేరాలని సూచించారు. వెలగపూడి సచివాలయం నాల్గోబ్లాక్‌లోని పబ్లిసిటీ సెల్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి నెరవేరుస్తున్నారని, అంగన్వాడీల డిమాండ్లను కూడా పరిష్కరిస్తారని, ఇప్పటికే అందుకు ఉత్తర్వులు జారీ చేశారని ఉషశ్రీ తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అంగన్వాడీలకు గ్రాట్యుటీ చెల్లించే అంశంపై కేంద్రానికి లేఖ రాశామని, సమాధానం రాగానే దీనిని పరిశీలిస్తామని చెప్పారు. అంగన్వాడీల గౌరవ వేతనం పెంచుతామన్న హామీ ప్రకారం రూ.11, 500 ఇస్తున్నట్లు తెలిపారు. అదే సమయంలో వేతనాలను పెంచేందుకు ఇది సరైన సమయం కాదన్నారు. అంగన్వాడీ కేంద్రాల తాళాలను ఎవరూ పగుల కొట్టలేదని, బాలింతలకు, గర్భిణులకు ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు ఆయా జిల్లాల కలెక్టర్లు ఈ కేంద్రాలను నడిపేలా చర్యలు తీసుకున్నారని విలేకరుల ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. సమావేశంలో స్త్రీ,శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి, సంచాలకుడు విజయకృష్ణన్ పాల్గొన్నారు.

ఆలయాల పరిరక్షణకు సహకరించండి

గవర్నర్‌కు జ్వాలాపురం శ్రీకాంత్ విజ్ఞప్తి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ప్రాచీన ఆలయ సంస్కృతి పరిరక్షణ కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేస్తున్న కృషికి తమవంతు సహకారం అందించాలని గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌కు ప్రభుత్వ సలహాదారు (దేవాదాయ శాఖ విభాగం) జ్వాలాపురం శ్రీకాంత్ విజ్ఞప్తి చేశారు. విజయవాడ రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను గురువారం ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. పురాతన ఆలయాల పునర్నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలను గవర్నర్‌కు ఆయన వివరించారు. చారిత్రక ఆలయాలను సంరక్షించడం ద్వారా భావితరాలకు హైందవ ధర్మ సంస్కృతిని అందించే అవకాశం ఉంటుందని అన్నారు. కేంద్రం నుంచి అందాల్సిన నిధులతో పాటు పురావస్తు శాఖ అనుమ తుల ద్వారా పురాతన ఆలయాల మరమ్మతులకు తమవంతు సహకారం అందించాలని విన్నవిం చారు. ముఖ్యంగా ద్రాక్షారామం, గుడిమల్లం వంటి ఆలయాల పునరుద్ధరణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభ్యర్థనపై పురావస్తు శాఖ అనుమతులు లభించాల్సి ఉందని, ఈ విషయంలో గవర్నర్ ప్రమేయం ఉంటే త్వరగా ఫలితం ఉంటుందని శ్రీకాంత్ చెప్పారు. పూర్తి వివరాలతో కూడిన వినతిపత్రాన్ని గవర్నర్‌కు అందజేశారు.

ఐక్య పోరాటాలే కార్మికులకు అండ

- ఏపీ ఆశా వర్కర్ల రాష్ట్ర సదస్సులో నేతలు
- జనవరి 1న రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు
- 2న ప్రతి పీహెచ్‌సీలో వినతి పత్రాలు
- 30లోపు అన్ని జిల్లాల్లో సదస్సులు, చలో విజయవాడ

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్): రాష్ట్రంలో వివిధ రంగాలలో ప్రభుత్వ సేవలు అందించే కార్మికులంతా ఆందోళన చేస్తున్నారని, ఐక్య పోరాటాలతోనే విజయం సాధించవచ్చని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ఓబులేసు అన్నారు. గురువారం దాసరి భవన్‌లో ఏఐటీయూసీ అనుబంధ ఆంధ్ర ప్రదేశ్ ఆశా వర్కర్ల యూనియన్ రాష్ట్ర సదస్సు జరిగింది. యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.సుభాషిణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఓబులేసు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో ఆశా వర్కర్లు 55,400 మంది 36 రకాల యాప్‌లతో రాత్రి, పగలు పనిచేస్తున్నా కనీస వేతనాలు ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. ప్రతి ఆశా కార్యకర్తకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, వైద్య ఉద్యోగులుగా గుర్తించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్న డిమాండ్లు న్యాయ సమ్మతమైనవని తెలిపారు. రాష్ట్రంలో కార్మికులంతా తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం సమ్మె బాట పట్టడంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి ముచ్చెమటలు పడుతున్నాయన్నారు. రాష్ట్రంలో కరువు నెలకొందని, మరోవైపు ఇటీవల మిచౌంగ్ తుపానుకు 20 లక్షల ఎకరాలు పంట ధ్వంసమైనా కేంద్ర ప్రభుత్వాన్ని ఆర్థిక సాయం అడగకుండా సీఎం జగన్ బండరాయి మాదిరిగా ఉన్నాడని ఎద్దేవా చేశారు. లక్షా 6 వేల మంది అంగన్‌వాడీలు, వారి కుటుంబాలను కలుపుకొని 60 లక్షల మంది పది రోజులుగా ఆందోళన చేస్తున్నా సమస్యను పరిష్కరించకుండా రాష్ట్ర ప్రభుత్వం తాత్సారం చేస్తోందని విమర్శించారు. కార్మికులంతా ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని, ఏఐటీయూసీ అండగా ఉంటుందని తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు పి.దుర్గాభవాని మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తల్లీపిల్లలకు మెరుగైన వైద్యం అందించేందుకు ఎన్ఆర్‌హెచ్ఎం పథకంలో రెండు కోట్ల ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పని చేస్తున్నారన్నారు. అయితే వారితో వెట్టిచాకిరీ చేయించడం జగన్ పాలనలో కొనసాగుతోందని తెలిపారు. వీరికి ప్రభుత్వ పథకాలు వర్తించకపోవడం దుర్మార్గమన్నారు. జగన్ ప్రభుత్వానికి స్కీం వర్కర్లు, మహిళల పట్ల చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ప్రజా సంక్షేమం పట్టని ప్రభుత్వానికి చరమగీతం పాడేందుకు కార్మికులందరూ ఐక్యం కావాలని, ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పాలన్నారు. తెలుగు మహిళా ఎన్టీఆర్ జిల్ల అధ్యక్షురాలు చెన్నుపాటి ఉషారాణి మాట్లాడుతూ రాష్ట్రం లో మహిళలంతా రోడ్లపై కూర్చొని నిరసన తెలపాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఆశాల ఐక్య ఉద్యమాలకు తెలుగు మహిళలంతా అండగా ఉంటారని తెలిపారు. ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లలితమ్మ మాట్లాడుతూ పది రోజులుగా అంగన్‌వాడీ కార్యకర్తలు తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సమ్మె చేస్తున్నారని తెలిపారు. దీనిపై ప్రభుత్వంతో నాలుగు దఫాలుగా చర్చలు జరిపినా కొలిక్కి రాలేదన్నారు. తొలుత ఆశా వర్కర్స్ యూనియన్ కడప జిల్లా గౌరవ అధ్యక్షులు జి.వేణుగోపాల్ స్వాగతం పలికారు. ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్.శాంతి మాట్లాడిన అనంతరం తీర్మానాలు ప్రవేశపెట్టారు. జనవరి 1న రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని, 2న ఆశా డే సందర్భంగా ప్రతి పీహెచ్‌సీలో వినతి పత్రాలు సమర్పించాలని, ఈనెల 30 లోపు అన్ని జిల్లాలలో సదస్సులు, అనంతరం చలో విజయవాడ కార్యక్రమం నిర్వహించాలని ప్రవేశపెట్టిన తీర్మానాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఇన్‌ఛార్జ్ ఎస్.వెంకటసుబ్బయ్య, శ్రామిక మహిళా ఫోరం రాష్ట్ర నాయకురాలు కళ్లేపల్లి శైలజ, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ కార్యనిర్వాహక అధ్యక్షురాలు ప్రేమ, ఆశా వర్కర్స్ జిల్లా నాయకులు నాగవేణి, చాముండేశ్వరి, చంద్రమణి, శాంతమ్మ, మంగ, రాజమ్మ, రత్న, వివిధ జిల్లాల ఆశా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్‌పై ప్రజా తిరుగుబాటుకు

యువగళం సభ నిదర్శనం: అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: యువగళం సభ విఫలం కావాలని వైసీపీ ప్రభుత్వం అడుగడుగునా అడ్డంకులు సృష్టించిందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు విమర్శించారు. ప్రజల్లో తిరుగుబాటు వస్తే జగన్ అడ్డుకోలేడని యువగళం ముగింపు సభ నిరూపించిందని, ఇది ఉత్తరాంధ్ర చరిత్రలోనే అతిపెద్ద సభగా నిలిచిందన్నారు. వ్యక్తం చేశారు. విశాఖలోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో అచ్చెన్నాయుడు మాట్లాడుతూ యువగళం ముగింపు సభను విజయంతం చేసిన టీడీపీ- జనసేన శ్రేణులకు ధన్యవాదాలు తెలిపారు. రేపు జరగబోయే ఎన్నికలు జగన్‌కు టీడీపీ మధ్య లేక జగన్‌కు జనసేనకు మధ్య కాదని, జగన్‌కు ప్రజలకు మధ్య పోటీ అని అన్నారు. త్వరలో మూడు చోట్ల ఇదే తరహాలో సభలు నిర్వహిస్తామని అచ్చెన్నాయుడు ప్రకటించారు. మాజీమంత్రులు కళా వెంకట్రావు, గంటా శ్రీనివాసరావు, అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ జగన్ ప్రజాస్వామ్యాన్ని కాలరాశారని, అభివృద్ధిని పక్కనబెట్టి విధ్వంసం సృష్టించారన్నారు. నియంతృత్వ పోకడలున్న వ్యక్తి జగన్ అని విమర్శించారు. టీడీపీ-జనసేన పొత్తు తర్వాత జరిగిన మొదటి సభకు ఉత్తరాంధ్ర వేదిక కావడం అదృష్టమని, ఇది టీడీపీ అధినేత చంద్రబాబు వల్లే సాధ్యమైందని చెబుతూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. 'జగన్‌కు పుట్టినరోజు ఓ సలహా ఇస్తున్నా... ఎందుకు ఇన్ని వేల ఎకరాలు దోచేస్తున్నారు. పోయేటప్పుడు ఎవరికైనా ఆరు అడుగుల స్థలమే కావాలి. నువ్వు పొట్టోడివి కాబట్టి నీకు మూడు అడుగులు చాలు' అని అయ్యన్నపాత్రుడు వ్యంగ్యంగా మాట్లాడారు. జగన్‌పై 31 కేసులున్నాయని, సీబీఐ దగ్గర పెద్ద రిపోర్ట్ ఉందన్నారు. ఏజెన్సీలో మంజూరు చేసిన జలవిద్యుత్ ప్రాజెక్టుని గిరిజనులు వ్యతిరేకిస్తున్నారని, జగన్ సొంతమనిషికి ఈ ప్రాజెక్టు ఇచ్చారని, 40 గిరిజన గ్రామాలు మునిగిపోతాయన్నారు. 53 వేల ఎకరాలకు సాగు నీరు అందదన్నారు. పర్యాటక శాఖ మంత్రి హోదాలో గిరిజనులతో డాన్స్ చేసిన రోజా దీని కోసం నోరు ఇప్పలేదన్నారు. సమావేశంలో మాజీ మంత్రి కోండ్రు మురళి, విశాఖ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

రైతుల నడ్డి విరుస్తున్న పాలకులు

ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం ఎన్టీఆర్ జిల్లా మహాసభలో వక్తలు

విశాలాంధ్ర-నందిగామ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దేశానికి వెన్నెముక అయినా రైతాంగం నడ్డి విరుస్తున్నాయని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ విమర్శించారు. ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం ఎన్టీఆర్ జిల్లా ప్రథమ మహాసభలు గురు వారం నందిగామ లోని చంద్ర రాజేశ్వరరావు భవన్‌లో జరిగాయి. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో రైతులు పాత బస్టాండ్ చౌదరి హోటల్ నుంచి గాంధీ సెంటర్, మెయిన్ బజార్, విజయ టాకీస్, ఎన్టీఆర్ రోడ్డు మీదుగా రైతుపేట చంద్ర రాజేశ్వరరావు భవన్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం దివంగత రైతు నాయకులు సూర్యదేవర నాగేశ్వరరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. మహాసభ ప్రారంభంగా ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం పతాకాన్ని రైతు సంఘం సీనియర్ నాయకులు, మునగచర్ల గ్రామ సర్పంచ్ పొంగులూరి నర్సింహయ్య ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన మహాసభకు సీనియర్ నాయకులు, వీరులపాడు గ్రామ మాజీ సర్పంచ్ వట్టికొండ చంద్రమోహన్ అధ్యక్షత వహించారు. వక్తలు మాట్లాడుతూ దేశానికి వెన్నుముక, ప్రాణ కోటికి తిండిగింజలను పండించే రైతుల ప్రయోజనాల పరిరక్షణ కోసం ఎప్పుడూ రైతన్నకు అండగా ఉండే ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం జిల్లా మహాసభలు నందిగామలో నిర్వహిం చడం అభినందనీయం అన్నారు. చిన్న, సన్నకారు రైతు సమస్యలపై అనేక ఉద్యమాలు నిర్వహించడంతో పాటు పోలవరం, చింతలపూడి వంటి నీటిపారుదల ప్రాజెక్టులను తర్వతిగతిన పూర్తిచేయాలని, సాగునీటి వనరుల ఏర్పాటు కోసం, మేలైన విత్తనాల కోసం, నకిలీ ఎరువులు, పురుగు మందుల నియంత్రణ కోసం, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని పోరాటాలు సాగిస్తోందని తెలిపారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అవలంబిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తోందని అన్నారు. దేశ ఆర్థిక ప్రగతికి పునాది అయిన వ్యవసాయ రంగాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడంలో పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, రైతుల ఆత్మహత్యలు పరిపాటిగా మారాయన్నారు. రైతుల సమస్యలు పట్టని అధికార పార్టీ నేతలు... రైతుల ఆత్మహత్యలను తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం దుర్మార్గమన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు లేక, బ్యాంకు రుణాలు అందక అప్పులు చేసి పండించిన పంట గిట్టుబాటు ధరలేక రైతాంగం ఘోషిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ శాస్త్రవేత్త ఎం.ఎస్. స్వామినాథన్ కమిషన్ సిఫార్సు అమలు చేస్తామని, గిట్టుబాటు ధర కల్పిస్తామని అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయడం సాధ్యంకాదని సుప్రీం కోర్టుకు అఫిడవిట్ ఇచ్చి రైతాంగానికి ద్రోహం చేసిందని విమర్శించారు. రైతుల మెడకు ఉరితాళ్లుగా మారగల ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లను బిగించే ప్రక్రియను వేగవంతం చేసిందన్నారు. వ్యవసాయ రంగ పరిరక్షణ కోసం రైతాంగాన్ని సంఘటితపరచాల్సిన అవసరం ఉందని అన్నారు. తీవ్ర వర్షాభావం, నీటి ఎద్దడి కారణంగా జిల్లా వ్యాప్తంగా 14 మండలాల్లో కరువు విలయ తాండవం చేస్తోందని, ప్రభుత్వం కేవలం గంపలగూడెం, తిరువూరు మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి చేతులు దులుపు కుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై స్పందిం చాల్సిన స్థానిక ప్రజాప్రతినిధులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఎన్టీఆర్ జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం అధ్వర్యంలో అనేక గ్రామాలలో పంటలను పరిశీలించి, వాస్తవ పరిస్థితులను జిల్లా కలెక్టర్, జిల్లాలోని ఇతర అధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్లు ఆయన చెప్పారు. మిచౌంగ్ తుపాను వలన నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని, సహాయక చర్యలు చేపట్టాలని, తడిసిన పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని అనేక పోరాటాలు చేసినట్లు వివరించారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం అధ్వర్యంలో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్ర బాబు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పుటూరి అరుణ్ కుమార్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బుద్ధి రమేష్, ఆంధ్ర ప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.జమలయ్య, ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం కృష్ణా జిల్లా అధ్యక్షులు ముక్కామల ఉమామహేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తూము కృష్ణయ్య, మేకల డేవిడ్, సీనియర్ నాయకులు వల్లంకొండ బ్రహ్మం, పొన్నం నరసింహారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుకూరి వెంకటేశ్వరరావు, సీపీఐ మండల కార్యదర్శి మన్నే హనుమనురావు, పట్టణ కార్యదర్శి వేముల వీరయ్య, రైతు సంఘం నాయకులు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం ఎన్టీఆర్ జిల్లా నూతన కమిటీ

ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం ఎన్టీఆర్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక జరిగింది. గౌరవ సలహాదారులుగా వట్టికొండ చంద్రమోహన్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా చుందూరు వెంకట సుబ్బా రావు, అధ్యక్షులుగా మల్నీడి యల్లమందరావు, గౌరవాధ్యక్షులుగా తూము కృష్ణయ్య, ఉపాధ్యక్షు లుగా ఉన్నం సాంబశివరావు, పోల్నీడి నాగ భూషణం, పద్మాల వెంకటేశ్వరరావు, కార్యదర్శు లుగా పత్రి హరికృష్ణ, నృసింహాద్రి వనమాలి, పేర్నా వెంకటరమణ, కోశాధికారిగా మేకల డేవిడ్‌తో పాటు 17 మందిని ఎన్నుకున్నారు.

వైసీపీలో ఫ్లెక్సీల రగడ

- మంత్రి జయరాం వర్సెస్ జెడ్పీటీసీ విరుపాక్షి
- కర్నూలు జిల్లాలో మరోసారి బయటపడిన విభేదాలు
- మంత్రి వర్గీయులపై పోలీసులకు ఫిర్యాదు

ఆలూరు-విశాలాంధ్ర: కర్నూలు జిల్లా ఆలూరు అసెంబ్లీ నియోజకవర్గంలోని వైసీపీలో మరోసారి విభేదాలు భగ్గుమన్నాయి. కొన్నాళ్లుగా అధికార పార్టీలోని చిప్పగిరి జెడ్పీటీసీ విరుపాక్షి వర్గం... మంత్రి గుమ్మనూరు జయరాం వైఖరిని నిరసిస్తూ వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. గతంలో జెడ్పీటీసీ విరుపాక్షిపై మంత్రి తనయుడు గుమ్మనూరు ఈశ్వర్, సోదరుడు ఆలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ గుమ్మనూరు నారాయణలు తీవ్రమైన పదజాలంతో దూషించడంతో మనస్థాపానికి గురైన విరుపాక్షి రాజీనామాకు సిద్ధపడ్డాడు. దీంతో అధినాయకత్వం జెడ్పీటీసీ విరుపాక్షితో మాట్లాడి రాజీనామా యోచనను విరమింప చేశారు. ఆ సమయంలో జెడ్పీటీసీ రాజీనామా వ్యవహారం జిల్లాలో సంచలనంగా మారింది. తాజాగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదినం సందర్భంగా ఆస్పరి మండలంలో ఫ్లెక్సీల రగడ వెలుగుచూసింది. పది రోజుల క్రితం ఆస్పరి మండల కేంద్రంలో సీఎం జగన్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా జరపాలని, రక్తదాన శిబిరాన్ని కూడా ఏర్పాటు చేయాలని జెడ్పీటీసీ విరుపాక్షి తన అనుచరులకు చెప్పారు. దీంతో వారు ఆస్పరి మండల కేంద్రంలోని స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో, బస్టాండ్ చుట్టూ ప్రధాన కూడళ్లలో జగన్‌కు శుభాకాంక్షలు చెబుతూ మంగవారం ఉదయం పెద్దఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న మంత్రి జయరాం సీఎం జగన్ పుట్టినరోజు వేడుకలను ఆస్పరిలో పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలని స్థానిక ప్రజా ప్రతినిధులకు, ముఖ్య నాయకులకు తెలియజేశారు. అయితే మంత్రి జయరాం, జెడ్పీటీసీ విరుపాక్షి అనుచరులు ఆస్పరిలో జగన్ పుట్టిన రోజు వేడుకలు నిర్వహిస్తే రెండు వర్గాల

మధ్య గొడవలు జరుగుతాయని, శాంతిభద్రతల సమస్య అవుతుందన్న ఉద్దేశంతో పోలీసులు జెడ్పీటీసీ విరుపాక్షిని ఆస్పరికి రాకుండా అడ్డుకున్నారు. మంత్రి వర్గీయులు గురువారం ఉదయం ముఖ్యమంత్రి జన్మదినాన్ని పురస్కరించుకొని ఆస్పరిలో మంత్రి జయరాం, తనయుడు, సోదరుల ఫొటోలతో భారీ ఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఆస్పరికి మంత్రి తనయుడు గుమ్మనూరు ఈశ్వర్, సోదరుడు దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు, అలాగే ఆలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ గుమ్మనూరు నారాయణ సీఎం జగన్ జన్మదిన వేడుకల్లో పాల్గొని స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో కేక్ కట్ చేసి శు భాకాంక్షలు తెలుపుతూ ప్రసంగించారు. అనంతరం బైక్ ర్యాలీగా వెళుతున్న సమయంలో మంత్రి అనుచరులు అంబేద్కర్ సర్కిల్‌లో రెండువైపులా ఉన్న జెడ్పీటీసీ విరుపాక్షి ఫ్లెక్సీలను చించి వేస్తూ విరుపాక్షికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ బీభత్సం సృష్టించారు. పోలీసులు నిలువరించే ప్రయత్నం చేసినా మంత్రి అనుచరులు వినలేదు. రానున్న ఎన్నికల్లో ఆలూరు నుంచి జెడ్పీటీసీ విరుపాక్షికి ఎమ్మెల్యే టికెట్ ఖరాయ్యిందని, మంత్రి గుమ్మనూరు జయరాం కర్నూలు ఎంపీగా పోటీలో ఉంటారని నియోజకవర్గంలో ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఫ్లెక్సీలు చించేసి... ఇలాంటి దుశ్చర్యకు పాల్పడ్డారని విరుపాక్షి అనుచర వర్గీయులు ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని విరుపాక్షి దృష్టికి స్థానిక వైసీపీ నాయకులు తీసుకెళ్లారు. దీంతో ఆస్పరిలో ఆయన అనుచరులు పోలీసుస్టేషన్లలో ఫిర్యాదు చేశారు. ఫ్లెక్సీలు తొలగించినవారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ పరిణామాలతో అధికార పార్టీలో విభేదాలు ఎటు దారితీస్తాయోనని వైసీపీ శ్రేణుల్లో చర్చనీయాంశమయ్యింది.

జీతభత్యాల కోసం పోరాడాల్సిందేనా!

ఏపీ జేఏసీ అమరావతి అసహనం

7న విశాఖలో ఏపీఎంఈఎస్‌ఏ తొలి మహాసభ : బొప్పరాజు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: చేసిన పనికి వచ్చే జీతం కోసం కూడా ఉద్యమాలు తప్పడం లేదని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అసహనం వ్యక్తం చేశారు. ఉద్యోగులు గతంలో 92 రోజుల పాటు ఉద్యమాలు చేస్తే రూ.6,500కోట్లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందని గుర్తుచేశారు. ఇప్పుడు మళ్లీ అలాంటి పరిస్థితులే నెలకొన్నాయని, ఆందోళనలు చేసేంత వరకు తీసుకెళ్లవద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర విభజన జరిగి 10 ఏళ్లయినా సర్వీస్ రూల్స్ విషయంలో ప్రభుత్వాలు మాట్లాడకపోవడం దారుణమన్నారు. పదోన్నతల విషయంలో ఉద్యోగులకు ఇక్కట్లు తప్పడం లేదన్నారు. విశాఖ, జీవీఎంసీ ప్రధాన కార్యాలయం సెల్లార్‌లోని 'జెమ్స్' భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వీఎంసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వామనరావు, ఏపీఎంఈఎస్ఏ అధ్యక్షుడు దొప్పలపూడి ఈశ్వరరావుతో కలిసి బొప్పరాజు మాటాడారు. ఏపీలో కొత్తగా ఇచ్చిన మున్సిపాలిటీలకు సరిపడా సిబ్బంది లేరన్నారు. ఉద్యోగులకు సరెండర్ లీవ్, రిటైర్మెంట్ ప్రయోజనాలు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ సకాలంలో అందడం లేదని, దాచుకున్న డబ్బు కోసం ఇక్కట్లు తప్పడం లేదన్నారు. ఏపీలోని 17 కార్పొరేషన్ల పరిధిలోని ఉద్యోగుల ఐక్యతకు సమష్టిగా కృషిచేద్దామని పిలుపునిచ్చారు. ఉద్యోగుల హక్కులు, ప్రయోజనాల్ని కాపాడేందుకే ఏపీఎంఈఎస్ఏ కట్టుబడి ఉందని చెప్పారు. ఏపీ మున్సిపల్ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీఎంఈఎస్ఏ) తొలి మహాసభ విశాఖలోని గురజాడ కళాక్షేత్రంలో వచ్చేనెల 7వ తేదీన నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రత్యేక అతిథులుగా మంత్రులు బొత్స సత్యనారాయణ, ఆదిమూలపు సురేశ్ హాజరవుతారన్నారు. సభను విజయవంతం చేయాలని ఏపీఎంఈఎస్ఏ అధ్యక్షుడు దొప్పల పూడి ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శి అక్కరబోయిన అప్పలరాజు, కోశాధికారి రవి పిలుపునిచ్చారు. ఏపీఎంఈఎస్ఏ రాష్ట్ర మహాసభ బ్రోచర్లను నేతలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెమ్స్ గౌరవాధ్యక్షుడు వీవీ వామన్‌రావు, వీఎంసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి గుమ్మడి నర్సింగరావు (సింగ్), ఏపీ జేఏసీ విశాఖ జిల్లా చైర్మన్ నాగేశ్వరరావు, ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారం, విజయనగరం జిల్లా ఏపీఎంఈఎస్ఏ అధ్యక్షుడు అప్పలరాజు, విశాఖ జిల్లా అధ్యక్షుడు పీతల వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బిర్లంగి శంకర్రావు, జెమ్స్ అధ్యక్షుడు ఆడప అప్పలనాయుడు, కోశాధికారి సన్నీ, కార్యదర్శి పద్మజ, విశాఖ జిల్లా అవుట్ సోర్సింగ్ విభాగ అధ్యక్షుడు శ్రీనుబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ల సంఘం అధ్యక్షుడు మంగరాజు, శివతో పాటు ఉద్యోగుల సంఘాల నేతలు గణపతి, రాజేశ్, శ్రీనివాసరావు, వీరబాబు, అప్పలరాజు, ప్రసన్న, పోలారావు పాల్గొన్నారు.

సంపాదకీయం

పౌరహక్కుల వినాశక బిల్లులు

బ్రిటీష్ చట్టాలు కాస్త ఫాసిస్టు చట్టాలుగా రూపాంతరం చెందుతున్నాయి. బ్రిటీష్ హయాం నుంచి అమల్లో ఉన్న భారతీయ శిక్షాస్మృతి (ఐపీసీ), నేర శిక్షాస్మృతి (సీఆర్‌పీసీ), సాక్ష్యాధారాల చట్టం (ఎవిడెన్స్ యాక్ట్) స్థానంలో కొత్తగా తీసుకువచ్చిన మూడు నేర శిక్షాస్మృతి బిల్లులకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. అది కూడా మూజువాణి ఓటుతో, ప్రతిపక్ష సభ్యుల్లో దాదాపు 70 శాతం మందిని సస్పెండ్ చేసిన తర్వాత వీటికి ఆమోదముద్ర వేయడం గమనార్హం. ఈ పరిణామంతో తొమ్మిదేళ్లుగా పొంచివున్న ముప్పు ఎట్టకేలకు మనల్ని మింగేందుకు భూతంలా వచ్చిపడింది. సెక్షన్లను అటుఇటుగా మారిస్తే వచ్చే ప్రమాదమేమీ లేదు. అదే సమయంలో కొత్తకొత్త నేరాలు తలెత్తుతున్నందున, వాటికి సంబంధించిన సరికొత్త సెక్షన్లను 'సజావుగా' జోడిస్తే వచ్చే ఇబ్బందేమీ పెద్దగా ఉండకపోవచ్చు. కానీ బ్రిటిష్‌నాటి చట్టాల కన్నా దారుణమైన చట్టాలు తీసుకువస్తేనే పెద్ద ప్రమాదం. మోదీ సర్కారు అన్నంత పనీ చేసింది. ఏకంగా పౌర హక్కులు వినాశనమయ్యే రీతిలో కొత్త చట్టాలను తీసుకువచ్చింది. దశాబ్దాలనాటి చట్టాల బూజు దులపడం సులువే. కాకపోతే వాటి రూపురేఖలు మార్చి, ప్రజాహితాన్ని కాలరాయడం కచ్చితంగా నేరమే. కొత్త నేర చట్టాల పేరుతో మోదీ'రాజ్యం' భయానకమైన 'నేరం' చేసింది. ఆంగ్ల పేర్ల స్థానంలో హిందీనామాలను పెట్టింది. ఐపీసీ–1860 స్థానంలో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), సీఆర్‌పీసీ–1898 స్థానంలో భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్), ఎవిడెన్స్ యాక్ట్–1872 స్థానంలో భారతీయ సాక్ష్య (బీఎస్) బిల్లులను చట్టాలుగా మార్చుకునేందుకు 'లోక్‌సభ' మెడలువంచి ఆమోదింపజేసుకుంది. పేర్లను రాజభాషలోకి మార్చినంతమాత్రాన రాళ్లు... రప్పలేతప్ప రత్నాలు కావుకదా! ప్రతిపాదిత కొత్త చట్టాల్లో లొసుగులు అన్నీఇన్నీ కావు. ఇప్పటికే ఎందరో న్యాయనిపుణులు ఈ చట్టాలను ఎండగట్టడం మొదలుపెట్టారు. స్వతంత్ర, ప్రజాస్వామ్య దేశంలో అసలు అవసరమే లేదనుకుంటున్న రాజద్రోహాన్ని మోదీ ప్రభుత్వం ఇప్పుడు దేశద్రోహంగా మార్చింది. 124(ఏ) సెక్షన్‌ను తొలగించి, కొత్తసీసాలో పాతసారా పోసి, మరింత కుళ్లబెట్టినట్లు 121 సెక్షన్‌నే దేశద్రోహ చట్టంగా మార్చి, పోలీసులను జనంపైకి మరింత ఉసిగొల్పేలా చేసింది. ఇక నుంచి ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడితే, దేశానికి వ్యతిరేకంగా మాట్లాడినట్లే. ప్రభుత్వాన్ని విమర్శిస్తే, దాన్ని పాలకపక్షం తీవ్రంగా పరిగణిస్తే అది దేశద్రోహ నేరమవుతుంది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాసినా, పత్రికాముఖంగా వెల్లడించినా, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలో మాట్లాడినా, ఇకముందు బీఎన్ఎస్ (పాత ఐపీసీ) చట్టం కింద జైలులోతోసి మక్కలిరిగేలా తన్నాల్సిందే. ఈ పదప్రయోగం ఛీత్కరించేలా వుండవచ్చు. కానీ భవిష్యత్‌లో జరగబోయేది అదే. మోదీ ప్రభుత్వ లక్ష్యం కూడా అదే. ఇన్నాళ్లుగా సూచాయిగా కన్పిస్తున్న నియంతృత్వ పోకడలు ప్రతిపాదిత చట్టాలతో విశ్వరూపం ప్రదర్శించనున్నాయి. మోదీ పాలనాకాలంలో దాదాపుగా 170 మంది ప్రముఖులను రాజద్రోహం చట్టం కింద అరెస్టు చేశారు. ఈ చట్టాన్ని రద్దు చేయాలన్న డిమాండ్ ఇప్పటిదికాదు. బాలగంగాధర్ తిలక్ లాంటి స్వాతంత్ర్య సమరయోధులను నియంత్రించడానికి బ్రిటిష్‌వారు తెచ్చుకున్న చట్టమిది. దాన్ని మరింత కఠినంగా అమలు చేయాలని భావిస్తున్నారంటే, మోదీ ఫాసిస్టు ధోరణి తీవ్రత ఏస్థాయిలో వుందో అర్థమవుతోంది. మూకదాడి లేదా సామూహిక హింసాకాండకు మరణదండన విధించాలన్న నిబంధనకు పోలీసులు సరికొత్త భాష్యం చెప్పి, దారితప్పినా ఆశ్చర్యపోనవసరం లేదు. నిజానికి మూకదాడులకు శిక్షలుండాలంటే, మోదీపాలనలో కాషాయమూకలు జరిపిన దాడుల్లో వేలాది మందికి శిక్షలు పడాలి.

ప్రతిపాదిత క్రిమినల్ చట్టాలు పోలీసులకు అపరిమితమైన అధికారాలను కట్టబెడుతున్నాయని, వీటితో పౌరహక్కులకు విఘాతం కలుగుతుందని, ముఖ్యంగా ముస్లింలు, దళితులు, ఆదివాసీలకు ఈ బిల్లులు పూర్తిస్థాయిలో చేటు చేస్తాయన్న విషయాన్ని బిల్లులను ప్రవేశపెడుతూ అమిత్‌షా చేసిన ప్రసంగమే స్పష్టంగా చెపుతున్నది. మానవహక్కుల పేరుతో ఉగ్రవాదులను కొందరు సమర్థించడాన్ని ఇక సహించబోమని సభలో అమిత్‌షా పొట్టచించుకొని అరవడం విచారకరం. హక్కుల కోసం రోడ్డెక్కితే నేరమట! అభాగ్యులను 'పోలీసురాజ్యం' లాఠీలు, బాష్పవాయువులతో కబళిస్తే అది దేశరక్షణ. ఈ అరాచకాన్ని నిలదీసి అడిగితే అది దేశద్రోహం. భారతదేశ ప్రతిష్టను దిగజార్చేలా ఎవరు మాట్లాడినా సహించే పరిస్థితి ఉండదని చెపుతున్న హోంమంత్రి దేశ ప్రతిష్టకు, ప్రభుత్వ ప్రతిష్టకు మధ్య అంతరాన్ని చెప్పలేకపోయారు. దేశం, జెండా, భద్రత, ఆస్తులతో ఎవరు చెలగాటమాడినా జైలుకెళ్లాల్సిందేనని కూడా చెప్పుకొచ్చారు. అసలు గడిచిన 9 ఏళ్లలో దేశానికి, జెండాకు, భద్రతకు వ్యతిరేకంగా ఎవరు మాట్లాడారు? ఎంతమంది మాట్లాడారు? ఇంత గొప్ప చట్టాలను ఇంత హడావిడిగా తీసుకురావాలంటే, ఆ స్థాయి తీవ్రమైన నేపథ్యం ఉండి ఉండాలి కదా! దేశ జనాభాలో 18 శాతం మంది ఉన్న ముస్లిమ్‌లు, ఇతర మైనారిటీలందరినీ మోదీ ప్రభుత్వం 'ఉగ్రవాదులు'గా పరిగణిస్తోందా? లేక ఏ కశ్మీర్‌లోనో, ఈశాన్యంలోనో అప్పుడప్పుడూ అగుపించే కొద్దిమందిని మాత్రమే ఉగ్రవాదులుగా చూస్తున్నారా? అసలు ఈ చట్టంలో 'ఉగ్రవాదం' అనే పదానికి ఇచ్చిన నిర్వచనం ఎవరికి చెందుతుంది? పౌరసత్వ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళన చేస్తున్న వారినీ, గిట్టుబాటుధర కోసం రోడ్డెక్కిన రైతులనూ, కనీసవేతనాల్లేక కాలే కడుపుతో కాళ్లీడుస్తున్న అసంఘటిత కార్మికులనూ, ఉపాధి హామీకి దిక్కులేని వ్యవసాయ కూలీలనూ, వీరందరి బాధలనూ తమ బాధలుగా మలచుకొని కలం పెట్టి, గళం విప్పే పాత్రికేయులనూ ఉగ్రవాదులుగా పరిగణిస్తారా? గత దశాబ్దకాలంగా ఫాసిస్టు విధానాలతో మానవహక్కులను కాలరాస్తున్నదెవరు? లోక్‌సభలో గుండెలు బాదుకున్న అమిత్‌షా వాదనలో ఈ ప్రశ్నలకు సమాధానమే లేదు. ప్రతిపాదిత నేర సంహిత చట్టంలో కొత్తగా 20 నేరాలను చేర్చడం, పాతచట్టంలోని 19 నిబంధనలను తొలగించడం, 33 నేరాల్లో జైలు శిక్ష పెంచడం, 83 నేరాల్లో జరిమానా పెంచడం, 23 నేరాల్లో కనీస శిక్షను తప్పనిసరి చేయడం, అత్యాచారం సెక్షన్లు 375, 376లను 63గా మార్చడం, హత్య సెక్షన్ 302ను 101గా మార్చడం, కిడ్నాప్ సెక్షన్ 359ని 136గా మార్చడం వంటి అంశాలు పెద్దగా వివాదాస్పదం కాకపోయినప్పటికీ, వాటికి అనుబంధంగా భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (పాత సీఆర్‌పీసీ)లో నేరాంగీకార పరిధిని విస్తరించడం లాంటి అంశాలు తప్పుడు కేసులు బనాయిస్తే, అమాయకులైన నిందితులకు యమపాశాలవుతాయి. మొదటి 40 నుంచి 60 రోజుల రిమాండ్‌లో 15 రోజుల పోలీసు కస్టడీకి అనుమతినివ్వడం ఇబ్బందికరమే. పత్రికా, ప్రసార, సామాజిక మాధ్యమాలకు సంబంధించి పేర్కొన్న నిబంధనలన్నీ స్వేచ్ఛహక్కును హరిస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు. ఎక్కువ కేసుల్లో జవాబుదారీతనం, పారదర్శకత ఉంటాయని ఆశించలేం. ఫిర్యాదు అందిన మూడు రోజుల్లోనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని, 14 రోజుల్లో ప్రాథమిక విచారణ పూర్తిచేయాలన్న నిబంధన వల్ల పెద్దగా ఒరిగేదేమీ లేదు. ఎందుకంటే 'నేరస్తుల'న్న ముద్ర వేసి హించడానికి పోలీసులకు ఒక్కరోజు చాలు. అసలు అరెస్టునే చూపించకుండా ఉండటంలో మన పోలీసులు సిద్ధహస్తులు. జిల్లా, రాష్ట్రస్థాయిలో ప్రత్యేకాధికారులు, విచారణాధికారుల నియామకం నిబంధన కూడా ఫక్తు పాలకపక్షాలకు అనుకూలంగా ఉంటుంది. ఎంతో ప్రమాదకరమైన ఈ బిల్లులను 'చరిత్రాత్మకం' అని భావించినప్పుడు సమగ్రమైన చర్చ లేకుండా, ప్రతిపక్ష సభ్యులను సస్పెండ్ చేసి మరీ చట్టాలుగా మార్చుకోవడం వెనుక పరమోద్దేశం ఏమిటో తెలుస్తూనే ఉంది. దేశద్రోహానికి సంబంధించిన క్లాజును పూర్తిగా తొలగించాలి. ఈ బిల్లులను కామా, ఫుల్‌స్టాప్‌లతో సహా ఆమూలాగ్రం చదివానని సంబరపడి చెప్పుకున్న అమిత్‌షా ఈ బిల్లులపై ప్రతిఘటన ఎదుర్కోక తప్పదు.

గణితంలో దిట్ట రామానుజన్



భారతీయ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ 125వ జయంతిని పురస్కరించుకుని 2012 నుండి డిసెంబర్ 22 న జాతీయ గణిత దినోత్సవంగా జరుపుకుంటున్నాం. ఈ యేడాది యునెస్కో భారతదేశం యువ విద్యార్థులలో గణిత శాస్త్ర అభ్యాసం, అవగాహన వ్యాప్తికి కలిసి పనిచేయ సంకల్పించాయి. భారతీయ గణితశాస్త్రంలో శ్రీనివాస రామానుజన్ చేసిన కృషిని, గణితంలో రామానుజన్ అనువర్తనాలపై నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్స్ వర్క్‌షాప్‌ను నిర్వహిస్తుంది. తమిళనాడులోని కుంభకోణంలో చీరల దుకాణంలో గుమస్తాగా పనిచేసే శ్రీనివాస అయ్యంగార్, గుడిలో పాటలుపాడే కోమలటమ్మాళ్ దంపతులకు 1887 డిసెంబర్ 22వ తేదిన శ్రీనివాస రామానుజన్ జన్మించారు. నవంబరు 1897లో 10 ఏళ్ళు నిండకముందే, అతను ఆంగ్లం, తమిళం, భూగోళశాస్త్రం, అంకగణితంలో తన ప్రాథమిక పరీక్షలలో జిల్లాలో అత్యుత్తమ స్కోర్‌లతో ఉత్తీర్ణుడయ్యాడు. 11 సంవత్సరాల వయస్సులోనే అధునాతన త్రికోణమితిపై యస్.ఎల్ లోనీ రాసిన పుస్తకాన్ని అర్థం చేసుకున్నాడు. 13 సంవత్సరాల వయస్సులో అధునాతన సిద్ధాంతాలను స్వయంగా కనిపెట్టాడు. 14 సంవత్సరాల నాటికి, మెరిట్ సర్టిఫికేట్‌లు, అకడమిక్ అవార్డులను అందుకున్నాడు. 1903లో రామానుజన్ తన 16వ ఏట జి.యస్ కార్ రాసిన 'ఏ సినాప్సిస్ రిజల్ట్స్ ఇన్ ప్యూర్ అండ్ అప్లైడ్ మేథమెటిక్స్' పుస్తకంలోని విషయాలను వివరంగా అధ్యయనం చేశాడు. 1904లో టౌన్ హయ్యర్ సెకండరీ స్కూల్ నుండి విద్యాభ్యాసం కానిచ్చి తరువాత పచ్చయ్యప్ప కళాశాలలోచేరి కేవలం గణిత శాస్త్రంలో మాత్రమే మంచి మార్కులు పొంది మిగతా సబ్జెక్టుల్లో మంచి మార్కులు పొందలేకపోయాడు. డిసెంబరు 1906లో ఫెలో ఆఫ్ ఆర్ట్స్ పరీక్షలో ఫెయిలయ్యాడు. 14 జూలై 1909న, రామానుజన్ తొమ్మిదేళ్ళ జానకి అమ్మాళ్‌ను వివాహం చేసుకున్న పిదప బ్రతుకు తెరువుకై అప్పట్లో కొత్తగా ఒక గణిత శాస్త్ర సమాజాన్ని ఏర్పరిచిన డిప్యూటీ కలెక్టర్ రామస్వామిని కలుసుకున్నాడు. ఆయన పనిచేసే ఆఫీసులో ఒక చిన్న ఉద్యోగం కోరి ఆయనకు తాను గణితంమీద రాసుకున్న నోట్ పుస్తకాలను చూపించాడు. రామస్వామి రామానుజన్‌కు కొన్ని పరిచయ లేఖలు ఇచ్చి మద్రాసులో తనకు తెలిసిన గణిత శాస్త్రవేత్తల దగ్గరకు పంపించాడు. 1912వ సంవత్సరంలో రామానుజన్ ఒక గణిత లెక్చరర్ పరిధి మేరకు అకౌంటింగ్ క్లర్క్ గా ఉద్యోగం సంపాదించారు. నెలకు 30 రూపాయలు జీతం. ఉద్యోగానికి సంబంధించిన పనిని కేవలం సగం రోజులోనే పూర్తి చేసి మిగిలిన సమయంలో గణితంపై పరిశోధనలు చేసేవారు.1913 సంవత్సరంలో మద్రాస్‌లోని గణిత ప్రముఖులు రామానుజన్ జర్నల్‌ను గణితానికి సంబంధించిన రీసెర్చ్‌ను లండన్ కు పంపించారు. 1913లో మద్రాస్ వచ్చిన ప్రసిద్ధ గణిత శాస్త్రవేత్త డాక్టర్ వాకర్ ఈ పరిశోధనలు చూసి ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశాడు. రామానుజన్ కనుగొన్న 120 పరిశోధన సిద్ధాంతాలను ఆయన కేంబ్రిడ్జి యూనివర్సిటీ ప్రొఫెసర్ హార్డీ పంపాడు. మహా మేధావులకు మాత్రమే సాధ్యమయ్యే పరిశోధన ఫలితాలను చూసిన హార్డీ రామానుజన్‌ను కేంబ్రిడ్జి యూనివర్శిటీకి ఆహ్వానించారు. 1914 మార్చిలో లండన్‌కు వెళ్లిన రామానుజన్ అక్కడ నిరంతరం గణితంపై పరిశోధనలుచేసి కొత్త సిద్ధాంతాలను కనిపెట్టారు. ఫెలో ఆఫ్ ద ట్రినిటీ కాలేజి గౌరవం పొందిన తొలి భారతీయుడిగానూ, ఫెలో ఆఫ్ ద రాయల్ సొసైటీ గౌరవం పొందిన రెండవ భారతీయుడిగానూ ఆయన చరిత్రకెక్కారు. బ్రిటన్ నుంచి 1919 మార్చిలో భారతదేశానికి తిరిగి వచ్చారు. బ్రిటన్‌లో ఉన్నప్పుడు ఆరోగ్యం గురించి ఏమాత్రం లెక్కచేయకుండా గణిత పరిశోధనలకు ప్రాధాన్యత ఇవ్వడంతో తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. దీంతో ఆయన స్వదేశానికి వచ్చిన ఏడాది తర్వాత అంటే 1920 ఏప్రిల్ 26న కేవలం 33 సం.లకే మృతిచెందారు.

రామానుజన్ నంబర్ :

1729ని రామానుజన్ సంఖ్య అని కూడా అంటారు. ఎందుకంటే రామానుజన్ ఇంగ్లాండ్‌లో ఆసుపత్రిలో ఉన్నప్పుడు ప్రొఫెసర్ హార్డీ ఆసుపత్రిలో రామానుజన్‌ని పరామర్శించినప్పుడు అతని కారు నంబర్ 1729 చాలా డల్ సంఖ్యగా అనిపించిందని చెప్పగా వెంటనే రామానుజన్ 1729 అనేది రెండు సంఖ్యల ఘనాల మొత్తం రూపంలో రెండు విధాలుగా రాసే మొదటి సంఖ్య ($1729=1^3+12^3=9^3+10^3$) అని ఉన్నపళంగా చెప్పాడు. హార్డీ–రామానుజన్–రాడెమాచర్ అసిమ్ప్టోటిక్ ఫార్ములా, రామానుజన్ కాంగ్రెన్సీస్, రామానుజన్ మాస్టర్ థీరం, తీటా ఫంక్షన్, మాక్ తీటా ఫంక్షన్, రోజర్స్ రామానుజన్ ఐడెంటిటీస్, బెర్ట్రాండ్ పోస్ట్యులేట్ జనరలైజేషన్ మొదలగునవి.

థీసెస్ ఉపయోగాలు :

పార్టికల్ ఫిజిక్స్, స్టాటిస్టికల్ మెకానిక్స్, కంప్యూటర్ సైన్స్, స్పేస్ సైన్స్, క్రిప్టాలజీ, పాలిమర్ కెమిస్ట్రీ, మెడికల్ సైన్స్, లోహాలను కరిగించడానికి వాడే మెరుగైన బ్లాస్ట్‌ఫర్నేస్‌ల రూపకల్పనలో, టెలిఫోన్ కమ్యూనికేషన్, కంప్యూటర్ అల్గారిథమ్‌లలోను, లోలకాల కదలిక, తీగల కంపనం, విద్యుత్ ప్రవాహాల సమస్యల సాధనలో వినియోగిస్తున్నారు. రామానుజన్ మాస్టర్ థీరం క్వాంటం భౌతికశాస్త్రంలో ఉపయోగిస్తున్నారు. విశ్వానికి చెందిన బహుళ పరిమాణాలను వివరించడంలో, బ్లాక్ హెూల్ గురించి రామానుజన్ మాడ్యులర్ ఫంక్షన్ ఉపయోగపడుతుంది.

(నేడు జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా)

జనక మోహన రావు దుంగ
ఫోన్: 8247045230

జనాక్రోశంవల్లే పార్లమెంటులో చొరబాటు

ఆర్వీ రామారావు

సరిగ్గా ఇరవై రెండేళ్ల కిందట 2001 డిసెంబర్ 13న పార్లమెంటు మీద దాడి చేసింది తీవ్రవాదులు. ఆ దాడి పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాద దాడి అన్నారు. దాడికి దిగిన తీవ్రవాదులతో పోరాడి వారిని అంతం చేసే క్రమంలో మన భద్రతా దళాలలో కొందరు ప్రాణ త్యాగం చేయవలసి వచ్చింది. సరిగ్గా అదే డిసెంబర్ 13వ తేదీన ఈ ఏడాది మళ్లీ పార్లమెంటు మీద దాడి జరిగింది. ఈ దాడి చేసింది పాకిస్తాన్ ప్రేరేపిత తీవ్రవాదులు కారు. ఆ ఆరుగురూ మన దేశంలో అదే పనిగా పెరుగుతున్న నిరుద్యోగ సేనకు ప్రతినిధులు. వారి ఉద్దేశం పార్లమెంటుకు కానీ, సభ్యులకు కానీ హాని చేయడం కాదు. కేవలం తమ సమస్యను దేశవాసుల దృష్టికి తీసుకురావడానికే పార్లమెంటులోకి చొరబడడానికి ప్రయత్నించారు. ఇద్దరు యువకులు పార్లమెంటులోకి చొరబడగలిగితే మిగతావారు ఆవరణలోనే ఉండి పోయి నినాదాలు చేశారు. తాజా దాడిలో ప్రధానమైన తేడా ఇదే. కానీ అప్పుడూ ఇప్పుడూ అధికారంలో ఉన్న మోదీ నాయకత్వంలోని బీజేపీకి వాస్తవాలతో పనిలేదు. జనంఘోష వారికి ఎటూ వినిపించదు. ఈ సారీ వినిపించక పోవడంలో ఆశ్చర్యంలేదు. వీరందరి మీద చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (యూఏపీఏ) కింద కేసులు నమోదు చేశారు. అంటే వీరినీ తీవ్రవాదులుగా జమకట్టేశారు. యూఏపీఏ కింద కేసు నమోదుచేయడం అంటే బెయిలు లేకుండా సుదీర్ఘ కాలం జైలులో ఉంచేయవచ్చు. విచారణ ఎప్పుడు మొదలవుతుందో, ఎన్నటికి పూర్తి అవుతుందో తెలియదు. యూఏపీఏ చట్టం అంతిమంగా ఈ యువకులకు ఉద్యోగం రాకుండా చేస్తుంది. పార్లమెంటులోకి చొరబడగలిగినవారు చేసిందల్లా పొగ వదలడమే. అదీ హానికరమైంది కాదు. ఇది కేవలం తమ బాధ జనం దృష్టికి తీసుకురావడానికే తప్ప అపకారంచేసే ఉద్దేశం ఏమీ

లేదు. వారి దగ్గర ఆయుధాలూ లేవు. కానీ వారిని అదుపులోకి తీసుకున్న తరవాత పోలీసుల లాఠీ దెబ్బలు మాత్రం దండిగానే వడ్డించారు. 2001లో జరిగిన దాడి ప్రమాదకరమైంది. విధ్వంసం సృష్టించడానికి ఉద్దేశించింది. మొత్తం దేశ రాజకీయ నాయకత్వాన్ని మట్టుపెట్టడానికి పన్నిన కుట్ర అని అప్పటి కేంద్ర హోం మంత్రి లాల్ కృష్ణ అద్వానీ అన్నారు. వీలైనప్పుడల్లా పార్లమెంటులో గొంతు చించుకునే హోం మంత్రి ఒక్క మాట కూడా మాట్లాడలేదు. పార్లమెంటుకు అరుదుగా మాత్రమే వచ్చే ప్రధానమంత్రి మోదీ వచ్చినా దేశాన్ని కలచివేసే అంశాలపై పెదవి విప్పే అలవాటు లేనివారు. ఆయన మాట్లాడవలసిన చోట, మాట్లాడవలసిన సందర్భంలో మాట్లాడరు. ప్రధానమంత్రి ఏం చెప్తారో వినాలని ఆశించే జనాన్ని ఆయన ఎన్నడూ ఖాతరు చేయరు. కానీ పార్లమెంటు ఆవరణలో మణిపూర్ మారణ హోమంపై పిచ్చాపాటీగా మాట్లాడారు. ఈ సారి కూడా బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో మాట్లాడారు. కానీ అసలు కారణాల ఊసే ఎత్తలేదు. పైగా ప్రతిపక్షాలు ఈ దాడిని సమర్థిస్తున్నాయని అభాండం వేశారు. వాస్తవాల వక్రీకరణలో మోదీని మించిన వారు ఎవరుంటారుగనక! మైసూరుకు చెందిన మనోరంజన్ శర్మ, ఇ–రిక్షా డ్రైవర్ సాగర్ శర్మ పార్లమెంట్ లోపలికి ప్రవేశించారు. ఏదో గ్యాసు వదిలారు. వారు "నియంతృత్వం చెల్లదు" అని నినాదాలు చేశారు. పార్లమెంటు ఆవరణలో ఈ ఇద్దరి అనుచరులు గ్యాస్ వదిలి, "నిరకుశత్వం చెల్లదు. భారత్ మాతా కి జై, జై భీం, జై భారత్" అని నినాదాలు చేశారు.

ఈ చొరబాటుకు సూత్రధారి లలిత్ ఝా అని చెప్పిన పోలీసులు ఆయనను అరెస్టు చేయడంలో విఫలమయ్యారు. ఆయనే స్వచ్ఛందంగా లొంగి పోయారు. తామే అరెస్టు చేశామన్న కీర్తి పోలీసులకు దక్కకుండా చేశారు. దేశంలోని దూర దూర ప్రాంతాల నుంచి ఇంకా అనేక మందిని అరెస్టు చేస్తూనే ఉన్నారు. ఇదంతా కుట్ర అని నిరూపించాలంటే పోలీసులు ఆ మాత్రం శ్రమించాల్సిందే. నిరుద్యోగాన్ని లోకం దృష్టికి తీసుకురావడానికి సాహసానికి ఒడిగట్టిన యువకుల ఉదంతాన్ని కొండంతలు చేసి చూపాలని పోలీసులు విశ్వ ప్రయత్నం చేస్తున్నారు. గోదీ మీడియా ప్రచారం సరే సరి. తీవ్రవాద రంగు పులమడానికీ తంటాలు పడ్తున్నారు. చొరబడిన వారు పారిపోవడానికి ప్రయత్నించలేదు. తాము చేసిన పనికి కేసులు, శిక్ష తప్పదని వారికి తెలుసు. ఇలాంటి వారి మీద కిరాతకమైన యూఏపీఏ మోపవచ్చునా? మోదీ ప్రభుత్వంలో ఏదైనా సాధ్యమే.అసలు సాహసించి చొరబడిన వారి గురించిన వివరాలు తెలుసుకోవడం మంచిది.

మనోరంజన్: ఆయనకు 35 ఏళ్లు. ఆయన మైసూర్‌కు చెందిన కంప్యూటర్ ఇంజనీరింగ్ నిపుణుడు. తగిన ఉద్యోగం దొరక్క కొంతకాలం ప్రైవేట్ ఐ.టి. కంపెనీలో పని చేశాడు. ఇప్పుడు తండ్రికి వ్యవసాయంలో తోడ్పడుతున్నాడు. ప్రభుత్వం ఉపాధి అవకాశాలు కల్పించనందుకు నిరసన తెలియజేస్తున్నాడు. నిరుద్యోగం, మణిపూర్ పరిస్థితి, ధరల పెరుగుదలను జనం దృష్టికి తీసుకురావడానికే పార్లమెంటులో చొరబడ్డానని ఒప్పుకున్నాడు. మనోరంజన్ సందర్శకుల గ్యాలరీలోంచి పార్లమెంటులోకి దూకాడు. పసుపు పచ్చని గ్యాస్ వదిలాడు.

సాగర్ శర్మ: 32 ఏళ్ల సాగర్ శర్మ ఢిల్లీలో జన్మించినా తల్లిదండ్రులతో పాటు లక్నోలో ఉంటాడు. నిరసనలో పాల్గొనడానికి ఢిల్లీ వెళ్తున్నానని తల్లిదండ్రులకు చెప్పే వచ్చాడు. పట్టభద్రుడైన శర్మ కొంత కాలం బెంగళూరులో పనిచేశాడు. కొంత కాలం నుంచి ఇ–రిక్షా నడుపుతున్నాడు. ప్రభుత్వం అన్ని రంగాలలోనూ విఫలమవుతోందని, పేదలు మరింత పేదలవుతున్నారని అంటాడు. నిత్యావసర వస్తువుల ధరలు నడ్డి విరుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశాడు.

నీలం ఆజాద్: 37 ఏళ్ల నీలం ఆజాద్ హర్యానాలోని జింద్ వాసి. ఎం.ఫిల్. చేశారు. ఉద్యోగం మాత్రం దొరకలేదు. అధ్యాపక వృత్తిలో చేరడానికి కావలసిన "నీట్" పరీక్ష కూడా ఉత్తీర్ణులయ్యారు. విద్యార్హత ఉన్నా ఉద్యోగం రానందుకు ఆమె విచలితులై ఉన్నారు. 2020–21లో ఏడాదికి పైగా జరిగిన రైతుల ఉద్యమంలో, షాహీన్ బాగ్ పోరాటంలో, మహిళా మల్ల యోధుల ఆందోళనలో ఆమె పాల్గొన్నారు. ఆమె మీద భగత్ సింగ్, అంబేద్కర్ ప్రభావం ఉంది. మణిపూర్‌లో మహిళలపై అత్యాచారాలు ఆమెను తీవ్రంగా కలవర పరిచాయి.

అమోల్ షిండే: 26 ఏళ్ల అమోల్ షిండే మహారాష్ట్రలోని లాతూర్‌లో ఒక దళిత వ్యవసాయదారుడి కుమారుడు. అమోల్ పోలీసుశాఖలో చేరాలనుకున్నాడు. సైన్యంలో చేరడానికి రాసిన పరీక్ష ఉత్తీర్ణుడు కాలేనందువల్ల ఆయన మానసిక ఒత్తిడికి గురయ్యాడు. ఇప్పుడు అగ్నివీర్ పథకంలోనూ ఉద్యోగంలో చేరడానికి వయసు మీరిపోయింది. పోలీసుశాఖలో చేరడానికి ఢిల్లీ వెళ్తున్నాని తల్లిదండ్రులకు చెప్పి ఢిల్లీ చేరుకున్నాడు.

విశాల్ శర్మ: పార్లమెంటులో చొరబడిన అమోల్, మనోరంజన్, సాగర్‌ని గూర్‌గావ్ లోని తన ఇంట్లో బస చేయనిచ్చినందుకు పోలీసులు విశాల్ తో పాటు ఆయన భార్య రేఖను కూడా అరెస్టు చేశారు. విశాల్‌ను విక్కీ అని కూడా అంటారు. ఎగుమతులు చేసే ఒక కంపెనీలో డ్రైవర్‌గా పని చేసేవాడట. విశాల్ కు 40 ఏళ్లు.

లలిత్ ఝా: 38 ఏళ్ల లలిత్ ఝా బిహార్‌కు చెందిన వాడు. కోల్‌కతాలో ఉంటున్నాడు. వృత్తి రీత్యా ఉపాధ్యా యుడు. పార్లమెంటు ఆవరణలోకి వెళ్లిన తరవాత నీలం, అమోల్, మనోరంజన్, సాగర్ తమ మొబైల్ ఫోన్లను లలిత్ ఝా దగ్గర ఉంచి వెళ్లారు. నీలం, లలిత్ గ్యాస్ వెదజల్లుతుండగా వారి ఫొటోలు తీశాడు. వాటిని సామాజిక మాధ్యమాలలో వినియోగించాడు. ఈ చొరబాటు సంఘటన వెనక ప్రణాళిక అంతా లలిత్‌దేనని పోలీసులు అంటున్నారు.

కాంగ్రెస్, ఆప్ కలిస్తే బీజేపీ గల్లంతే!

డా॥ జ్ఞాన్‌పాఠక్

ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రాల్లో ఆప్, కాంగ్రెస్‌ల మధ్య పొత్తు కుదరనున్నందున బీజేపీకి దెబ్బ తగులుతుందని అంచనా వేస్తున్నారు. ఈ రెండు పార్టీల మధ్య పొత్తు విషయం ప్రారంభంలో కొంత ఇబ్బంది ఉండవచ్చు. అయితే ఢిల్లీ, పంజాబ్‌ల్లో ఆప్ ప్రభుత్వాలున్నాయి. గతంలో బీజేపీ గెలుచుకున్న ఎంపీ సీట్లు ఈసారి కచ్చితంగా తగ్గుతాయని విశ్లేషిస్తున్నారు. ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ ఇండియా కూటమి తరపున కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జునఖర్గెను ప్రతిపాదించారు. ఇండియా కూటమి పార్టీల మధ్య సీట్ల పంపిణీపై త్వరలోనే చర్చలు జరగనున్నాయి. పంజాబ్–ఢిల్లీలలో కాంగ్రెస్, ఆప్ మధ్య సీట్ల పంపిణీపై కొన్ని నెలలుగా ప్రాథమిక చర్చ జరుగుతోంది. ఆయా రాష్ట్రాలలో నాయకుల పొత్తు గురించి సందేహాలు వెలువడుతున్నాయి. 2019లో బీజేపీ ఢిల్లీలో 7 లోక్‌సభ సీట్లను గెలుచుకున్నది. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి 56.56 శాతం ఓట్లు వచ్చాయి. పంజాబ్‌లో 13 సీట్లకుగాను 2 సీట్లు లభించాయి. గుజరాత్‌లో 26 సీట్లకుగాను మొత్తం సీట్లు గెలవగా 62.1 శాతం ఓట్లు లభించాయి. ఆప్ 2014లో నాలుగు లోక్‌సభ సీట్లు గెలుచుకున్నప్పటికీ 2019లో ఒక్క సీటు మాత్రమే దక్కించుకున్నది. గడచిన అయిదేళ్ల కాలంలో రాజకీయ వాతావరణం గణనీయంగా మారింది. ఢిల్లీలో70 అసెంబ్లీ స్థానాలకుగాను ఆప్ 62 సీట్లు గెలుచుకుంది. పంజాబ్‌లో 117 సీట్లకు గాను 92 సీట్లలో గెలుపొందింది. 2022లో గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ 5 సీట్లను గెలుచుకున్నది.

2019 లోకసభ ఎన్నికల్లో ఢిల్లీలో కాంగ్రెస్‌కు 22.63 శాతం, ఆప్‌కు 18.2 శాతం ఓట్లు లభించాయి. బీజేపీకి ఈ రెండు పార్టీల కంటె 56.86 శాతం ఓట్లు వచ్చాయి. బీజేపీకి 10.46 శాతం ఎక్కువగా వచ్చాయి. పుల్వామా దాడికి సంబంధించి బీజేపీకి వాతావరణం మారడంతో ఓట్లు ఎక్కువ లభించాయి. రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ మంచి ఫలితాలను పొందింది. పుల్వామా

దాడి జరిగినప్పుడు లభించినన్ని ఓట్లు బీజేపీకి రాలేదు. గణనీయంగా సీట్లు లభించిన మూడు రాష్ట్రాలలోనూ బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అయితే గతంలో కంటే 5–17 శాతం ఓట్లు తగ్గాయి. ఢిల్లీలో అత్యధికంగా ఓట్లు బీజేపీకి తగ్గనున్నాయి. 2019లో పుల్వామా దాడి కారణంగా ఓట్ల శాతం బాగా పెరిగిందనేది గుర్తుంచుకోవాలి. ఆ తరువాత ఢిల్లీలో కాంగ్రెస్ ఓట్ల శాతం 7.41 శాతం అదనంగా తెచ్చుకోగలిగింది. గత రెండేళ్ల కాలంలో అసెంబ్లీలకు జరిగిన ఎన్నికల్లో అన్ని చోట్ల పునరుజ్జీవనం పొందుతున్న సంకేతాలు ఉన్నాయి. అయితే ఢిల్లీలో అధికంగా ఓట్లు తెచ్చుకోలేకపోయింది. ఎందుకని? 2019లో ఆప్‌కు ఓట్ల శాతం బాగా తగ్గింది. ఒకేసారి 14.79 శాతం ఓట్లు పడిపోయాయి. 2020లో 53.5 శాతానికి పెంచుకోగలిగింది. 2015లో వచ్చిన ఓట్ల కంటే 0.73 శాతం తగ్గాయి. అలాగే కాంగ్రెస్ ఓటు శాతం గణనీయంగా 4.2 శాతం తగ్గిపోయింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్, ఆప్ పొత్తు కుదిరితే ఢిల్లీలో బీజేపీ తప్పనిసరిగా ఓడిపోయే అవకాశం ఉంది. అందువల్ల రెండు పార్టీలు కలిసి పోటీ చేయాలి. 2019లో 7 సీట్లు గెలుచుకున్నప్పటికీ 2024లో బీజేపీ ఓటమి ఖాయమని విశ్లేషిస్తున్నారు.

పంజాబ్‌లో కాంగ్రెస్, ఆప్ ప్రధానంగా పోటీచేసే పార్టీలు. ఆప్ 2019లో కేవలం 7.46 శాతం మాత్రమే ఓట్లు తెచ్చుకుంది. కాంగ్రెస్ 8 సీట్లను మాత్రమే గెలుచుకున్నప్పటికీ 40.5శాతం ఓట్లు లభించాయి. అప్పుడు బీజేపీ 2 సీట్లు మాత్రమే గెలుచుకుంది. శిరోమణి అకాలీదళ్ రెండు సీట్లు గెలుచుకుని 27.76 శాతం ఓట్లు తెచ్చుకుంది. బీజేపీకి 9.74 శాతం మాత్రమే ఓట్లు లభించాయి. 2020లో శిరోమణి అకాలీదళ్ బీజేపీ నుంచి విడిపోయింది. దీంతో రెండు పార్టీలు బలహీనపడ్డాయి. 2022 లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అకాలీదళ్‌కు ఓట్లు 18.38 శాతం మాత్రమే లభించాయి. అలాగే బీజేపీకి కూడా 6.6 శాతానికి తగ్గాయి. ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్, ఆప్ పొత్తు పెట్టుకుంటే బీజేపీ, ఆకాలీదళ్ పార్టీలకు అసలు సీట్లు లభించకపోవచ్చు. పంజాబ్‌లో 13 లోక్‌సభ సీట్లు ఉన్నాయి. ఇండియా కూటమి కలిసి పోటీ చేసినట్లయితే బీజేపీ నుంచి నాలుగు సీట్లు గెలుచుకునే అవకాశం ఉంది. లోక్‌దళ్ కూడా ఇండియా కూటమితో కలిసి పోటీచేస్తే బీజేపీ పూర్తిగా దెబ్బతినవచ్చు. ఆప్, కాంగ్రెస్ లోకసభ ఎన్నికలకు ప్రధానంగా పోటీచేస్తే ప్రయోజనం పొందిన లేదా నష్టం వచ్చిన ఇండియా కూటమి రాజకీయ భవిష్యత్‌పై పెద్ద ప్రమాదం ఏమీ ఉండదు. ఒకవేళ ఈ రెండు పార్టీల మధ్య విభేదాలు ఏర్పడితే అప్పుడు బీజేపీ, అకాలీదళ్ ప్రయోజనం పొందుతాయి.

2019లో గుజరాత్‌లో ఉన్న 26 సీట్లలోను బీజేపీ గెలుచుకుంది. 63.08 శాతం ఓట్లు లభించాయి. కాంగ్రెస్ 32.55 శాతం ఓట్లు పొందింది.అయితే 2022లో అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓట్లు 52.50 శాతం వరకు తగ్గిపోయింది. అంటే అంతకు ముందు వచ్చిన ఓట్లు కంటె 10.58 శాతం ఓట్లు తగ్గాయి. 2024 లోకసభ ఎన్నికల్లో కూడ గెలిచి మూడవసారి ప్రధానమంత్రిని అవుతానని ప్రధాని మోదీ మాట్లాడిన చోటల్లా చెబుతున్నారు. అయితే ఓట్లు 10.58 శాతం తగ్గినందున బీజేపీకి, మోదీకి ఆందోళనగానే ఉంది. 2019–22 మధ్య కాంగ్రెస్ ఓట్లు గుజరాత్‌లో 27.28 శాతానికి తగ్గిపోయింది. అంతకు ముందు వచ్చిన ఓట్ల కంటె 5.27 శాతం తగ్గింది. ఆప్ గుజరాత్‌లో 5 సీట్లు గెలిచి 12.92 శాతం ఓట్లు తెచ్చుకుంది. గుజరాత్‌లో మొదటిసారే ఆప్ గెలిచి 5 సీట్లను గెలుచుకుని గణనీయంగా ఓట్లు తెచ్చుకోగలిగింది. బీజేపీకి గుజరాత్‌లో ఓట్లు తరిగిపోయాయి. అదే సమయంలో మోదీ, బీజేపీ పట్ల వ్యతిరేకత ఏర్పడింది. కాంగ్రెస్, ఆప్ పొత్తు ఏర్పర్చుకుని ఎన్నికల్లో పోటీ చేసినట్లయితే బీజేపీ ఓట్లు తగ్గే అవకాశం ఎక్కువగా ఉంది. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో 182 సీట్లకు గాను బీజేపీ 156 సీట్లు గెలుచుకుంది. కాంగ్రెస్ 17 సీట్లను, ఆప్ 5 సీట్లను, ఎస్‌పి 1 సీటు గెలుచుకున్నాయి. ముగ్గురు ఇండిపెండెంట్లు గెలుపొందారు.

అశాంతి సృష్టికి కుట్ర

గవర్నర్, కాంగ్రెస్‌పై కేరళ సీఎం విజయన్ ఆరోపణ

తిరువనంతపురం: రాష్ట్రంలో శాంతికి విఘాతం కలిగించేందుకు గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్, ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తున్నాయని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ గురువారం ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమం నవ కేరళ సదస్సు సందర్భంగా విలేకరుల సమావేశంలో సీఎం విజయన్ మాట్లాడుతూ కేరళలో శాంతియుత వాతావరణాన్ని ధ్వంసం చేయాలనుకునేవారిలో ఖాన్ భాగమని, ఆయన చర్యలు ఇప్పటికే దీనిని సూచించాయని విజయన్ అన్నారు. 'కేరళలో శాంతికి విఘాతం కలిగించేలా ఘర్షణ వాతావరణం సృష్టించాలని, రెచ్చగొట్టాలని ఆయన కుట్ర పన్నారు. అయినప్పటికీ, దీనికి ప్రజల స్పందన గౌరవప్రదంగా ఉంది' అని ఆయన అన్నారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలకు ఛాన్సలర్‌గా వ్యవహరిస్తున్న ఖాన్ సెనేట్ నియామకాలపై సీపీఎం విద్యార్థి సంస్థ భారత విద్యార్థి సమాఖ్య(ఎస్ఎఫ్ఐ) కూడా బాధ్యతాయుతంగా నిరసన తెలిపిందని విజయన్ తెలిపారు. 'గవర్నర్ సృష్టించాలనుకున్న ఏదైనా వివాదానికి దారితీసే విధంగా వారు ప్రవర్తించలేదు. ఆయన స్థాయికి వారు (ఎస్ఎఫ్ఐ) దిగజారలేదు. వారు అతని ఉచ్చులో పడలేదు. దానిని అభినందించాలి' అని చెప్పారు. రాష్ట్ర

ఉన్నత విద్యా రంగం గణనీయమైన లాభాలను ఆర్జించకుండా నిరోధించేందుకు మతతత్వ శక్తులు, వారి ఏజెంట్లు ప్రయత్నిస్తున్నారని విజయన్ ఆరోపించారు. రాబోయే తరాల్లోనే దేశ భవిష్యత్తు ఉందని, అందువల్ల తమ మనసుల్లో జాత్యహంకారం, విద్వేషం అనే విషాన్ని ఎక్కుపెట్టే వారిపై సంఘటిత చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. విద్యార్థుల సమస్యలపై కేరళ స్టూడెంట్స్ యూనియన్ (కేఎస్‌యూ) నిర్వహించిన ప్రదర్శనను కూడా సీఎం ప్రశ్నించారు. రాష్ట్ర సచివాలయం వెలుపల ఒక రోజు క్రితం రాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు వి.డి.సతీశన్ చేసిన 'హింసకు పిలుపు' అమలు చేయడమే కేఎస్‌యూ ప్రదర్శన లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. 'అందువల్ల, రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించడమే ఉద్దేశం. దీనివల్ల వారికి (కాంగ్రెస్) ఏం లాభం? అలాంటి వైఖరి ఎందుకు తీసుకోవాలి? బాధ్యతాయుతమైన పార్టీ లేదా సంస్థ అటువంటి వైఖరిని తీసుకోగలదా?' అని ఆయన ప్రశ్నించారు. 'దురదృష్టవశాత్తు, ప్రతిపక్ష నాయకుడే హింసకు పిలుపునిస్తున్నారు. నిన్ననే చూశాం' అని సీఎం అన్నారు. కాంగ్రెస్ ప్రణాళికలు పనిచేయకపోవడం పట్ల వారి నిరాశను సూచిస్తున్నాయని విజయన్ అన్నారు. 'ఫలితంగా, వారే రెచ్చిపోతారు. కానీ దానికి ఇది (హింస) పరిష్కారం కాదు' అని ఆయన అన్నారు. సతీశన్ బుధవారం సచివాలయానికి యువజన కాంగ్రెస్ నిర్వహించిన ప్రదర్శనలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ నవ కేరళ సదస్సులో జిల్లా వ్యాప్తంగా పార్టీ యువజన విభాగం కార్యకర్తలపై దాడి చేసిన వారిపై పోలీసులు చర్యలు తీసుకోకపోతే ప్రతీకారం తీర్చుకుంటామని హెచ్చరించారు. తనపై నల్ల జెండాలు చూపుతున్న వారిపై దాడులు జరగడం లేదని, తమ ప్రాణాలను కాపాడుకునేందుకు నవ కేరళ సదస్సు బస్సు మార్గంలో నుంచి బయటకు నెట్టేశారని సీఎం విజయన్ తెలిపారు. 'నేను మొదటి నుంచీ అదే చెబుతున్నాను. వారిని బస్సులో నుంచి బయటకు నెట్టడం సహాయక చర్య. కానీ కాంగ్రెస్‌కి అది అక్కర్లేదు. ఎవరైనా హాని చేయాలని వారు కోరుకుంటారు. అందుకే బస్సు ముందు దూకాలని నిరసనకారులకు సూచించారు' అని సీఎం అన్నారు.

మరో ముగ్గురు ఎంపీల సస్పెన్షన్

146కు పెరిగిన సంఖ్య

న్యూఢిల్లీ: కేంద్రప్రభుత్వ నిరంకుశత్వం కొనసాగుతోంది. విపక్షం లేని పార్లమెంటు కోసం కసరత్తు ముమ్మరమైంది. కీలక బిల్లులను అడ్డు లేకుండా ఏకపక్షంగా ఆమోదించేందుకు కేంద్రం యత్నిస్తోంది. దీంతో సభలో అనుచిత వ్యహారన్న సాకును వాడుకుంటూ వరుసగా ప్రతిపక్ష ఎంపీలు అందరినీ సస్పెండ్ చేస్తోంది. గురువారం మరో ముగ్గురిపై వేటు పడింది. లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీలు దీపక్ బైజ్, డీకే సురేశ్, నకుల్ నాథ్ (కమల్‌నాథ్ తనయుడు)ను సస్పెండ్ చేస్తూ స్పీకర్ ఓం బిర్లా ఆదేశాలిచ్చారు. దీంతో ఇప్పటివరకు సస్పెన్షన్‌కు గురైన మొత్తం ఎంపీల సంఖ్య 146కి పెరిగింది. ఇందులో దిగువసభకు చెందిన 100 మంది ఉన్నారు. పార్లమెంటు భద్రతా వైఫల్యాన్ని ప్రశ్నించి, ప్రభుత్వ ప్రకటన కోసం డిమాండ్ చేయడంతో విపక్ష ఎంపీలపై సస్పెన్షన్ల పర్వం మొదలైంది. సభలో ప్రతిపక్ష సంఖ్యాబలం తగ్గించేసి నామమాత్రంగా చర్చలు జరిపి మూడు క్రిమినల్ చట్టాలను ఆమోదించడం సిగ్గుచేటని విపక్షాలు దుయ్యబట్టాయి. పార్లమెంటు ప్రజాస్వామ్యాన్ని ప్రభుత్వం ఖూనీ చేస్తోందని ఆరోపిస్తూ దిల్లీలోని పార్లమెంటు భవనం నుంచి విజయ్ నుంచి వరకు నిరసన ప్రదర్శనను సస్పెన్షన్‌కు గురైన ఎంపీలు నిర్వహించారు. ప్రతిపక్షం లేకుండా చేసి కీలక బిల్లులకు ఆమోదింపజేయించాలన్నది ప్రభుత్వ కుట్ర అని ఆరోపించారు.

ఆ నలుగురి కస్టడీ పొడిగింపు

న్యూఢిల్లీ: పార్లమెంటుపై దాడి కేసులో నలుగురు నిందితుల కస్టడీని మరో 15 రోజులు పొడిగిస్తూ పాటియాలా హౌస్ కోర్టు గురువారం ఉత్తర్వులు జారీచేసింది. మనోరంజన్, నీలం, సాగర్, అన్మోల్ కస్టడీని జనవరి 5 వరకు దిల్లీ పోలీసు ప్రత్యేక సెల్‌కు అప్పగించింది. తొలుత ఆరుగురు నిందితులను సీన్ రిక్రియేట్ కోసం దిల్లీ పోలీసు ప్రత్యేక సెల్, కౌంటర్ ఇంటెలిజెన్స్ యూనిట్ (సీఐయూ) తీసుకెళ్లినట్లు అధికారులు తెలిపారు. 7-8 సభ్యులతో వాట్సాప్ గ్రూపు తయారు చేసుకొని పార్లమెంటులోకి ఎలా వెళ్లాలి, భద్రతను ఎలా తప్పించుకోవాలి తదితర ప్రణాళికలను నిందితులు రూపొందించారని విచారణలో వెల్లడైనట్లు చెప్పారు. వాట్సాప్ గ్రూపులోని సభ్యులందరినీ పోలీసుల ప్రత్యేక సెల్ విచారించిందన్నారు. ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (సీఈఆర్‌టీ-ఇన్) సాయంతో ఈ-మెయిల్స్‌ను వెలికితీసే ప్రయత్నం జరుగుతోందని అన్నారు. కాగా ఆరుగురు నిందితులను స్పెషల్ సెల్ ఐదు వేర్వేరు యూనిట్లలో ఉంచి విచారిస్తున్నదని దిల్లీ పోలీసులు తెలిపారు. బుధవారం వీరిని సీఐయూకు అప్పగించారు.

రామమందిర ప్రతిష్ఠాపన

విపక్ష నేతలకు ఆహ్వానం

లక్నో: అయోధ్యలో జనవరి 22న జరగనున్న రామమందిర ప్రతిష్ఠాపన కార్యక్రమానికి కొంతమంది ప్రతిపక్ష నేతలకు ఆహ్వానం అందింది. కాంగ్రెస్ సీనియర్ నేతలు సోనియాగాంధీ, మన్మోహన్ సింగ్, మల్లికార్జున ఖర్గే, అధిర్ రంజన్ చౌదరి, జేడీ(ఎస్) అధినేత దేవెగౌడలకు ఆహ్వానాలు పంపినట్లు విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) కార్యనిర్వాహక అధ్యక్షుడు అలోక్ కుమార్ తెలిపారు. రానున్న రోజుల్లో మరింతమంది విపక్ష నేతలకు ఆహ్వానాలు పంపనున్నట్లు చెప్పారు. అయితే ఈ కార్యక్రమానికి విపక్ష నేతలు హాజరయ్యే అవకాశాలు కనిపించడం లేదు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఈ వేడుకకు హాజరుకానున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన సన్నాహాలు ఇప్పటికే జోరందుకున్నాయి. జనవరి 15 నాటికి ఏర్పాట్లన్నీ పూర్తి కానున్నాయి. ప్రాణ ప్రతిష్ఠ పూజ జనవరి 16న ప్రారంభమై జనవరి 22కు ముగియనుంది. రామ మందిర ప్రతిష్ఠాపన వేడుకలో భాగంగా జనవరి 17న 100 దేవతా విగ్రహాలతో శ్రీరాముడి జీవితంలోని దృశ్యాలను ప్రదర్శిస్తూ ఊరేగింపు ఉంటుంది. ఈ ఊరేగింపులో శ్రీరాముడు పుట్టినప్పటి నుంచి వనవాసం వరకు సాగిన జీవితం, లంకపై విజయం, అయోధ్యకు తిరిగి రావడం వంటి చిత్రాలు ఉంటాయని ప్రధాన శిల్పి రంజిత్ మండల్ తెలిపారు.

ఆధార్‌తో ఆస్తుల అనుసంధానం...

కేంద్రానికి దిల్లీ హైకోర్టు ఆదేశాలు

న్యూఢిల్లీ: దేశంలో ప్రతి ఒక్కరి స్థిర, చరాస్తులను ఆధార్‌తో అనుసంధానం చేసే విషయాన్ని పరిశీలించి మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి దిల్లీ హైకోర్టు సూచించింది. స్థిర, చరాస్తులను ఆధార్‌కి అనుసంధానం చేసేలా ఆదేశాలు జారీ చేయాలంటూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై(పిల్) విచారణ సందర్భంగా దిల్లీ హైకోర్టు ధర్మాసనం ఈ సూచనలు చేసింది. దేశంలో నల్లధనం, అవినీతి, బినామీల నివారణకు ఆధార్‌తో అనుసంధానం ఒక కీలక చర్య అవుతుందని పిటిషనర్ తన వ్యాజ్యంలో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై పూర్తి పరిశీలన అనంతరం విచారణ ముగించినట్లు ధర్మాసనం ప్రకటించింది. పిటిషనర్ లేవనెత్తిన అంశాలను ఒక విజ్ఞాపనగా తీసుకుని పరిశీలించాలని కేంద్రానికి సూచన చేసింది.

ఆదాయానికి మించిన ఆస్తుల కేసు

డీఎంకే మంత్రి పొన్ముడికి మూడేళ్ల జైలు

చెన్నై: ఆదాయానికి మించి ఆస్తుల కేసులో తమిళనాడు విద్యాశాఖ మంత్రి కె.పొన్ముడి, ఆయన భార్యకు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ మద్రాసు హైకోర్టు తీర్పు వెలువరించింది. అంతకుముందు ఈ కేసులో పొన్ముడి, ఆయన భార్య విశాలాక్షిని నిర్దోషులుగా పేర్కొంటూ వేలూరులోని దిగువ కోర్టు ఇచ్చిన తీర్పును మద్రాసు హైకోర్టు రెండు రోజుల క్రితం కొట్టివేసింది. మంత్రి, ఆయన భార్యను దోషులుగా తేల్చి మూడేళ్ల జైలు శిక్షతోపాటు రూ.50 లక్షలు జరిమానా విధిస్తూ జస్టిస్ జి.జయచంద్రన్ గురువారం తీర్పు వెలువరించారు. నిందితులు లొంగిపోయేందుకు 30 రోజుల గడువు ఇచ్చారు. ఈ తీర్పును సుప్రీం కోర్టులో సవాలు చేసేందుకు అవకాశం ఇస్తున్నట్లు తెలిపారు. మరోవైపు రెండేళ్లకు మించి జైలు శిక్ష పడటంతో పొన్ముడి తన శాసనసభ సభ్యత్వాన్ని కోల్పోనున్నారు. మంత్రి పొన్ముడి తొలిసారి 1989లో డీఎంకే టికెట్‌పై విల్లుపురం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1996-2001లో రవాణాశాఖ మంత్రిగా ఉన్నసమయంలో పొన్ముడి, ఆయన భార్య ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టినట్లు 2002లో అవినీతి నిరోధకశాఖ కేసు నమోదు చేసింది. ఈ విచారణలో వారిపై ఆరోపణలు రుజువు కాలేదని, తగిన ఆధారాలు లేకపోవడంతో నిందితులను విడుదల చేస్తున్నట్లు గతేడాది జూన్ 28న వేలూరు కోర్టు తీర్పు వెలువరించింది. ఈ తీర్పును ఏసీబీ హైకోర్టులో సవాలు చేయలేదు. దీంతో మద్రాస్ హైకోర్టు ఈ కేసును సుమోటోగా స్వీకరించి మంత్రి పొన్ముడి, ఏసీబీకి నోటీసులు జారీ చేసింది. అనంతరం ఏసీబీ సమర్పించిన ఆధారాలు పరిశీలించిన హైకోర్టు...పొన్ముడి, ఆయన భార్య ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టినట్లు రుజువైందని, వారికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.50 లక్షల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది.

రైతుల ఆందోళన, కుల గణన డిమాండ్‌పై మాట్లాడలేదే?

మోదీపై కాంగ్రెస్ విమర్శలు

న్యూఢిల్లీ : మిమిక్రీ వ్యవహారంపై బీజేపీపై విరుచుకుపడిన కాంగ్రెస్ పార్టీ... కుల జనాభా గణన డిమాండ్, రైతుల ఆందోళన వంటి సమస్యలపై మౌనంగా ఉన్న తర్వాత 'మోదీ పర్యావరణ వ్యవస్థ' రైతులు, కులాల గురించి గొంతు పెంచి మాట్లాడిందని విమర్శించింది. ఎంపీల సస్పెన్షన్‌కు వ్యతిరేకంగా పార్లమెంటు మెట్లపై ప్రతిపక్షాలు చేస్తున్న నిరసన సందర్భంగా తృణమూల్ కాంగ్రెస్ నాయకుడు కళ్యాణ్ బెనర్జీ ధన్కర్‌ను సరదాగా అనుకరించడంతో మంగళవారం రాజకీయ వివాదం చెలరేగింది. మిమిక్రీ రైతులను, ధన్కర్ సామాజిక వర్గాన్ని సమాజాన్ని అవమానించడమేనని అనేక మంది బీజేపీ నాయకులు ఈ అంశంపై ప్రతిపక్షాలపై మండిపడ్డారు. బీజేపీ చేస్తున్న ఈ దాడిపై, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ మాట్లాడుతూ ఇది 'ప్రఖ్యాతి గాంచిన మోదీ 3డి విజన్ పని : వక్రీకరణ, మళ్లింపు, పరధ్యానం' తప్ప మరొకటి కాదని అన్నారు. 'మణిపూర్ జాతి ఘర్షణలు, రైతుల ఆందోళనలో 700 మంది మరణించిన ఘటన, దిల్లీ పోలీసులు మహిళా రెజ్లర్లపై హింస, బీజేపీ ఎంపీ రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన అంశాలపై మోదీ పర్యావరణ వ్యవస్థ పూర్తిగా మౌనంగా ఉంది' అని జైరాం రమేశ్ తన 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. 'డిసెంబరు 13న లోక్‌సభలోకి చొరబాటుదారుల ప్రవేశాన్ని సులభతరం చేసిన బీజేపీ ఎంపీ పాత్ర. సామాజిక న్యాయం, దేశంలోని సామాజిక, ఆర్థిక, రాజకీయ నిర్మాణాలలో తగిన వాటాను నిర్ధారించడానికి కుల గణనను నిర్వహించాలని డిమాండ్' అని జైరాం రమేశ్ తెలిపారు. కానీ మోదీ పర్యావరణ వ్యవస్థ వీటన్నింటి గురించి మాట్లాడం లేదని విమర్శించారు.

'పిక్‌పాకెట్స్' కేసులో రాహుల్‌కు ఎదురు దెబ్బ

ఎనిమిది వారాల్లో చర్యలు తీసుకోండి: ఈసీకి దిల్లీ హైకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి 'పిక్ పాకెట్స్' కేసులో ఎదురు దెబ్బ తగిలింది. రాహుల్‌పై చట్టం ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని భారత ఎన్నికల సంఘానికి దిల్లీ హైకోర్టు ఆదేశాలిచ్చింది. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా, వ్యాపారవేత్త గౌతమ్ అదానీలను 'పిక్ పాకెట్స్'గా రాహుల్ వ్యాఖ్యానించడాన్ని తప్పుపట్టింది. ఈ వ్యాఖ్యలు సరైనవి కాదని, రాహుల్‌పై చర్యలు తీసుకునేందుకు ఎనిమిది వారాల గడువు ఇస్తున్నామని ఎన్నికల సంఘానికి ఉన్నత న్యాయస్థానం స్పష్టంచేసింది. ఈసీఐ పరిశీలనలో ఉన్న వ్యహారం కాబట్టే నిర్ణయం ఆ సంఘానికే వదిలేస్తున్నట్లు పేర్కొంది. పిక్‌పాకెట్స్ కేసును ఈసీ విచారిస్తోంది. నవంబర్ 26 లోపు సమాధానం ఇవ్వాలని నవంబర్ 23న రాహుల్‌కు నోటీసులు జారీ చేసింది. లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. అయితే రాహుల్ స్పందించకపోవడంతో ఆయనపై చర్యలకు న్యాయస్థానం ఆదేశించింది. ఎన్నికల సంఘం ఎలాంటి చర్యలు తీసుకోవాలనేది మాత్రం హైకోర్టు వెల్లడించలేదు.

ఆ పోస్టు వెంటనే తీసేయండి

రెండేళ్ల కిందట అత్యాచారం, హత్యకు గురైన తొమ్మిదేళ్ల దళిత బాలిక ఫొటోను సామాజిక మాధ్యమాల్లో రాహుల్ గాంధీ పోస్టు చేయడంపై దిల్లీ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. దానిని వెంటనే తొలగించాలని ఆదేశించింది. ఆ బాలిక తన కుటుంబంతో ఉన్న ఫొటోను రాహుల్ 'ఎక్స్'లో పెట్టారు. దీనిని సంబంధిత 'ఎక్స్' ఇండియా జియో బ్లాక్ చేసింది. 2021, ఆగస్టు 1న అనుమానస్పద పరిస్థితుల్లో బాలిక మరణించింది. ఆమె అత్యాచారం, హత్యకు గురైనట్లు తల్లిదండ్రులు ఆరోపించారు. దిల్లీలోని పాత నంగల్ గ్రామంలోని శ్మశానంలో అంత్యక్రియలు కూడా రహస్యంగా జరిపించారని దుయ్యబట్టారు. బాధితుల గుర్తింపును కాపాడాలంటే అది ప్రపంచవ్యాప్తంగా జరగాలని, భారత్‌లో ఈ పోస్టును 'ఎక్స్' తొలగించినప్పటికీ విదేశాల్లో అది అందుబాటులో ఉందని, దానిని వెంటనే తీసేయాలని రాహుల్ తరపు న్యాయవాదికి తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి మన్మోహన్ సూచించారు. పోస్టును తొలగించకపోతే అది ప్రపంచ మీడియా దృష్టిని ఆకర్షిస్తుందన్నారు. ఈ వ్యవహారంలో సామాజిక కార్యకర్త సురేశ్ మదేల్కర్ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం సంబంధిత పోస్టును తొలగించాలని రాహుల్ తరపు న్యాయవాది తరన్నుమ్ చీమాకు ఆదేశాలు జారీచేసింది.

చట్టవిరుద్ధం...రాజకీయ ప్రేరేపితం

ఈడీ సమన్లపై కేజ్రీవాల్

న్యూఢిల్లీ: తన జీవితంలో దాచడానికి ఏమీ లేదని, ఈడీ పంపిన సమన్లు చట్టవిరుద్ధం, రాజకీయ ప్రేరేపితమైనవని ఆప్ జాతీయ కన్వీనర్, దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ విమర్శించారు. మద్యం కుంభకోణం కేసులో విచారణకుగాను తమ ముందు హాజరు కావాలని కేజ్రీవాల్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఇటీవల సమన్లు జారీ చేసిన విషయం తెలిసిందే. వాటికి కేజ్రీవాల్ గురువారం బదులిచ్చారు. ఈ సమన్లు స్వీకరించడానికి దాను సిద్ధమేనని, కానీ, గతంలో ఇచ్చిన వాటివలే ఈ సమన్లు కూడా చట్టవిరుద్ధం, రాజకీయ ప్రేరేపితమైనవని మండిపడ్డారు. సమన్లు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. తాను నిజాయతీగా... పారదర్శకంగా జీవిస్తున్నానని కేజ్రీవాల్ తన సమాధానంలో పేర్కొన్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఏటా మాదిరిగానే ఈ చలికాలంలో కూడా విపాసన ధ్యానానికి వెళ్లనున్నట్లు గతంలోనే కేజ్రీవాల్ వెల్లడించారు. మరోవైపు సోమవారం ఆయనకు ఈడీ సమన్లు వచ్చాయి. గురువారం విచారణకు హాజరుకావాలని దర్యాప్తు సంస్థ అందులో పేర్కొంది. వాస్తవానికి షెడ్యూల్ ప్రకారం ముఖ్యమంత్రి మంగళవారమే విపాసనకు వెళ్లాల్సి ఉంది. అయితే, ప్రతిపక్షాల 'ఇండియా' కూటమి భేటీతో బుధవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయల్దేరి వెళ్లారు. ఈ సమయంలో సమన్లు ఇవ్వడాన్ని పార్టీ విమర్శించింది. తమ న్యాయవాదులు నోటీసులు పరిశీలిస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

భాషపై సంయమం అవసరం

రాజకీయ పార్టీలకు ఈసీ ఆదేశం

న్యూఢిల్లీ: రాజకీయ పార్టీలు, నేతలు తమ ఉపన్యాసాల్లో ఉపయోగించే భాషపై కేంద్ర ఎన్నికల సంఘం కీలక సూచనలు చేసింది. దివ్యాంగుల వైకల్యాన్ని తెలిపే పదాలను సాధ్యమైనంత వరకూ ఉపయోగించకుండా ఉండాలని స్పష్టం చేసింది. మూగ, పాగల్, సిర్ఫిరా, అంధ, గుడ్డి, చెవిటి, కుంటి వంటి పదాలను నేతలు వాడకుండా ఉండాలని ఈసీ ఆదేశించింది. రాజకీయ ప్రసంగాల్లో ఇలాంటి పదాలు నిషేధించాల్సిన ఆవశ్యకత ఉందని తెలిపింది. ఇది అవమానకరమైన భాష కాబట్టి అన్ని పార్టీలు సహకరించాలని, తమ నేతలకు తగిన సూచనలు ఇవ్వాలని పేర్కొంది. రాజకీయ ప్రసంగాల్లో దివ్యాంగులకు న్యాయం, గౌరవం కల్పించాలని ఈసీ తెలిపింది. రాజకీయ పార్టీలు, వాటి ప్రతినిధులు తమ రచనలు, కథనాలు, ప్రచారంలో... ఏదైనా బహిరంగ ప్రకటన లేదా ప్రసంగం సమయంలో దివ్యాంగులపై చెడు, అవమానకరమైన పదాలు ఉపయోగించకూడదని తేల్చిచెప్పింది.. రాజకీయ పార్టీలు, వాటి ప్రతినిధులు ఏదైనా బహిరంగ ప్రసంగంలో, రాజకీయ ప్రచారంలో మానవ అసమర్థత సందర్భంలో దివ్యాంగులు, వైకల్యం ప్రతిబింబించే విధమైన పదాలు వాడకూడదని పేర్కొంది. రాజకీయ పార్టీలు, ప్రతినిధులు వికలాంగుల వైకల్యానికి సంబంధించిన వ్యాఖ్యలను కచ్చితంగా నివారించాలని, అవి అభ్యంతరకరమైనవి, పక్షపాతాలను శాశ్వతం చేస్తున్నాయని ఈసీ పేర్కొంది. ప్రసంగాలు, సోషల్ మీడియా పోస్ట్‌లు, ప్రకటనలు, పత్రికా ప్రకటనలు సహా అన్ని ప్రచార సామాగ్రిలో వికలాంగుల పట్ల అసహ్యకరమైన లేదా వివక్షతతో కూడిన భాషాపరంగా ఉన్న పదాలను గుర్తించి వాటిని సరిదిద్దడానికి రాజకీయ పార్టీ అంతర్గత సమీక్ష ప్రక్రియను తప్పనిసరిగా నిర్వహించాలని ఈసీ సూచించింది. అన్ని రాజకీయ పార్టీలు తమ వెబ్‌సైట్‌లో వైకల్యం, లింగ సున్నితమైన భాషను ఉపయోగిస్తాయని నిర్ధారించుకుంటున్నట్లు ప్రకటించాలని తెలిపింది. అన్ని రాజకీయ పార్టీలు దివ్యాంగులను గౌరవిస్తున్నట్లు తమ పార్టీ వెబ్‌సైట్‌లో ప్రధానంగా ప్రచురించాలని ఈసీ సూచించింది.

లోక్‌సభలో భద్రతా వైఫల్యం కేసులో

మరో నిందితుడి అరెస్టు

బెంగళూరు: లోక్‌సభకు భద్రతా వైఫల్యం కేసులో మరో నిందితుడిని దిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బెంగళూరుకు చెందిన ఓ టెకీని దర్యాప్తు బృందాలు అదుపులోకి తీసుకొన్నాయి. అతడు కర్నాటక పోలీసు శాఖలో పనిచేసిన ఓ మాజీ ఉన్నతాధికారి కుమారుడు సాయికృష్ణ జగాలి అని పోలీసు వర్గాలు వెల్లడించాయి. రిటైర్డ్ డీఎస్పీ కుమారుడైన సాయి... లోక్‌సభలో అలజడి సృష్టించిన మనోరంజన్‌కు స్నేహితుడు. వారిద్దరూ బెంగళూరులోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో బ్యాచ్‌మెట్లు. విచారణలో భాగంగా మనోరంజన్ చెప్పిన వివరాల ఆధారంగా సాయికృష్ణను బాగల్‌కోటెలోని అతడి ఇంటి నుంచి అదుపులోకి తీసుకున్నారు.

అతడిని దిల్లీకి తరలించారు. తాజా పరిణామాలపై సాయి సోదరి మీడియాతో మాట్లాడారు. దిల్లీ పోలీసులు వచ్చి తన సోదరుడిని ప్రశ్నించారని, తాము విచారణకు పూర్తిగా సహకరించామన్నారు. తన సోదరుడు, మనోరంజన్ ఒకే ఇంట్లో ఉండేవారని, సాయి ఇప్పుడు ఇంటి నుంచి పనిచేస్తున్నాడని వివరించారు. అతడు ఎలాంటి తప్పు చేయలేదని తెలిపారు. పార్లమెంట్‌లో భద్రతా వైఫల్యం ఘటనలో పోలీసులు ఇప్పటి వరకు ఆరుగురిని అరెస్టు చేశారు.

వివక్షకు తావులేదు: ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: భారత్‌లో కొన్ని వర్గాలపై వివక్ష చూపుతున్నారన్న వాదనతో ప్రధాని నరేంద్ర మోదీ విభేదించారు. ప్రధాని గురువారం ఆంగ్లపత్రిక 'ఫైనాన్షియల్ టైమ్స్'కు ఇంటర్వ్యూ ఇచ్చారు. భారత్‌లోని మైనార్టీ వర్గాలపై వివక్ష గురించి అడిగిన ప్రశ్నకు మోదీ సమాధానమిస్తూ... భారత జనాభాలో అతి తక్కువ శాతం ఉన్న పార్సీ ప్రజల ఆర్థిక ప్రగతిని ఉదహరించారు. కొన్ని మైనార్టీ వర్గాలు తమ జీవనానికి భారత్ సురక్షితమైన దేశంగా భావించి ఇక్కడే స్థిరపడ్డాయన్నారు. భారతీయ సమాజం ఏ మతం, మైనార్టీ వర్గంపై వివక్ష చూపటం లేదని స్పష్టం చేశారు. భారత్‌లో మైనార్టీలను అణిచివేస్తున్నారన్న విమర్శలపైనా మోదీ స్పందించారు. వివిధ రకాల వేదికలపై విమర్శకులు తమ అభిప్రాయాన్ని స్వేచ్ఛగా వెల్లడిస్తారని, అలాంటప్పుడు ఆరోపణలకు సమాధానం చెప్పి... వాటిని ఖండించే హక్కు కూడా అవతలి పక్షానికి ఉంటుందని ప్రధాని గుర్తుచేశారు. భారత్‌లో ప్రజాస్వామ్యం బలహీనంగా ఉందన్న విమర్శలను ప్రధాని ఖండించారు. ఆ ఆరోపణలు చేయడం అంటే... ప్రజాస్వామ్య విలువలపై పౌరులకున్న నిబద్ధతను చులకన చేసినట్లేనని అన్నారు. దేశ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేందుకు బీజేపీ కట్టుబడి ఉందన్నారు. ఈ దశాబ్ద కాలంలో భారత్ అభివృద్ధి పథంలో సాగిందనే విశ్వాసం ప్రజల్లో నెలకొందని ప్రధాని తెలిపారు. ఇజ్రాయెల్-హమాస్ యుద్ధంపై స్పందిస్తూ ఇజ్రాయిల్‌తో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తూనే... గాజాకు అవసరమైన మానవతా సాయం అందించేందుకు భారత్ సిద్ధంగా ఉందని మోదీ తెలిపారు. ఇజ్రాయిల్-హమాస్ యుద్ధం కారణంగా గాజాలో నెలకొన్న పరిస్థితులపై రెండు దేశాల నాయకులతో తరచుగా చర్చిస్తున్నామని, ఆ ప్రాంతంలో శాంతి నెలకొల్పేందుకు భారత్ తన వంతు కృషి చేసేందుకు సిద్ధంగా ఉందని మోదీ తెలిపారు. పలస్తీనా విషయంలో భారత్ వైఖరిలో ఎలాంటి మార్పు ఉండదని చెప్పుకొచ్చారు.

ట్యాబ్‌లు సద్వినియోగించుకోవాలి

గిరిజన విద్యార్థులకు సీఎం జగన్ సూచన

విశాలాంధ్ర-చింతపల్లి (అల్లూరి జిల్లా): గిరిజన విద్యార్థులు ట్యాబ్‌లను సద్వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సూచించారు. ప్రపంచంతో పోటీ పడే విధంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. అల్లూరి జిల్లా, చింతపల్లిలో గురవారం పర్యటించిన సీఎం అక్కడి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల-1ను సందర్శించారు. ముందుగా పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం ఎనిమిదవ, తొమ్మిదో తరగతి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ బ్లాక్-గ్రీన్- ఐఎఫ్‌బీ బోర్డుల గురించి వివరించారు. 80 మంది ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్నారు. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి అధ్వర్యంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధ్యక్షతన ఈ సభ జరిగింది. విద్యార్థినీ, విద్యార్థులతో పాటు

ప్రజలనుద్దేశించి జగన్ ప్రసంగించారు. నాడు-నేడు నిధులతో పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్దామన్నారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల పాఠశాలలు శిధిలావస్థకు చేరాయని, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడటమే కాకుండా కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఆరు బయట తిరిగే పరిస్థితులు ఉండేవని అన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడి 52 నెలలలో పాఠశాలలను తీర్చిదిద్దామని, విద్యార్థులకు మెరుగైన విద్యా విధానం తెచ్చామని జగన్ చెప్పారు. తమ ప్రభుత్వంపై ప్రతిపక్ష నేతలు చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్‌తో సహా ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలు, టీవీ5 వంటి చానళ్లు దుష్ప్రచారం చేస్తున్నాయని, దీనిని తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఐటీ మంత్రి గుడివాడ అమర్నాథ్, కురుపాం, అరకు, రంపచోడవరం ఎమ్మెల్యేలు పాముల పుష్ప శ్రీవాణి, శెట్టి పాల్గుణ, ధనలక్ష్మి, అరకు ఎంపీ గొడ్డెటి మాధవి, ఎమ్మెల్సీలు కుంభ రవిబాబు, అనంతబాబు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, గిరిజన సహకార సంస్థ చైర్‌పర్సన్ శోభ స్వాతిరాణి, స్థానిక ఎంపీపీ, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి కోరాబు అనూష దేవి, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు దురియా పుష్పలత, విద్యశాఖ కమిషనర్ ప్రవీణ్ ప్రకాశ్, పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అభిషేక్, సర్పంచులు, ఎంపీటీసీలు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నేటి కవులు అభ్యుదయ దృక్పథాన్ని అనుసరించాలి

అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం: నేటి కవులు అభ్యుదయ దృక్పథాన్ని అనుసరించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ అన్నారు. విశాలాంధ్ర 23వ గుంటూరు పుస్తక మహోత్సవంలో భాగంగా స్థానిక లాడ్జి సెంటర్ ఏఎల్ బీఈడీ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సాహిత్య ప్రాంగణం నందు గురువారం సాయంత్రం గుంటూరు జిల్లా రచయితల సంఘం అధ్వర్యంలో 'కవితా గోష్ఠి' జరిగింది. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ కవులు ఆధునిక సమాజాన్ని, సామాజిక పరిస్థితులను అవగాహన చేసుకుని, వారి రచనల ద్వారా సమాజాన్ని చైతన్యవంతం చేయాలని సూచించారు. శాస్త్రీయ దృష్టితో కూడా ప్రజలను అప్రమత్తం చేసేలా కవిత్వాన్ని అందించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం.సుభాని మాట్లాడుతూ విశాలాంధ్ర పుస్తక మహోత్సవంలో అనేక అంశాలకు సంబంధించిన పుస్తకాలను ప్రదర్శించడంతో పాటు సాహిత్య అభిలాష కలిగిన కవులు, కవయిత్రిలతో కవితా గోష్ఠులు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రజాస్వామ్య దేశంలో స్వేచ్ఛను హరించే విధానాలపై తమ కలాలను ఝళిపించి హక్కుల సాధన కోసం పోరాడాల్సిన నైతిక బాధ్యత రచయితలదని అన్నారు. అరసం కార్యవర్గ సభ్యులు స్ఫూర్తి సుభాని మాట్లాడుతూ సమాజంలో విస్తరిస్తున్న అనేక మూఢ నమ్మకాలను పారద్రోలేలా రచనలు ఉండాలన్నారు. బాల సాహిత్యాన్ని ప్రోత్సహించాలన్నారు. చుండూరు శేషుమాంబ, షేక్ ఖాసింబి, ఎం.లలిత కుమారి, షేక్ బషీరున్నీసా బేగం, కొణతం నాగేశ్వరరావు, సయ్యద్ జానీబాషా, బొమ్ము ఉమామహేశ్వర రెడ్డి, దారివేముల అనిల్ కుమార్, కొరివి భాస్కరరావు, బండి జమదగ్ని వివిధ అంశాలపై తమ కవితలు వినిపించారు. తొలుత ఇటీవల మరణించిన గుంటూరు జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు, ప్రముఖ కవి సోమేపల్లి వెంకట సుబ్బయ్య మృతికి మౌనం పాటించి సంతాపం తెలిపారు.

నేటి కార్యక్రమాలు: పుస్తక మహోత్సవంలో భాగంగా అరసం కార్యదర్శి కె.శరశ్చంద్ర జ్యోతిశ్రీ నిర్వహణలో ప్రజా నాట్యమండలి జాతీయ కార్యదర్శి అధ్యక్షతన 'అభ్యుదయ గీతాలు' అంశంపై శుక్రవారం విద్యార్థులకు పోటీలు నిర్వహించనున్నారు.

ఉపాధి చట్టం సక్రమ అమలు కోసం పోరు

8న కలెక్టర్లకు వినతిపత్రాలు

జల్లి విల్సన్, ఆవుల శేఖర్ పిలుపు

విశాలాంధ్ర-విజయవాడ: గ్రామీణ ఉపాధి హామీ చట్టం సక్రమ అమలు కోసం, దాని రక్షణ కోసం వ్యవసాయ కార్మిక సంఘం శ్రేణులు అహర్నిశలు పాటుపడాలని, కష్టజీవులకు అండగా నిలవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ పిలుపునిచ్చారు. ఉపాధి హామీలో కొంతమంది స్వార్థపరులు చొరబడి అవినీతికి పాల్పడుతున్నారని విమర్శించారు. ఈ సమస్యలన్నింటిపై జనవరి 8వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టర్లకు వినతి పత్రాలు సమర్పించాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సర్వసభ్య సమావేశం గురువారం విజయవాడలోని దాసరి నాగభూషణరావు భవన్‌లో రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది.

జల్లి విల్సన్ మాట్లాడుతూ పాలకుల కనుసన్నల్లో ఉపాధి హామీ నడుస్తున్నదని, అడిగిన వారికి సక్రమంగా పని కల్పించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నందున వలసలు అధికమయ్యాయన్నారు. వలసల నివారణ కోసం వచ్చిన ఈ చట్టాన్ని నిర్వీర్యం చేస్తుంటే చేతులు ముడుచుకొని కూర్చోవాలా అని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన ప్రశ్నించారు. పాలకుల చిత్తశుద్ధి ఉపాధి హామీపై కొరవడిందని, పాలకులకు బుద్ధి చెప్పే విధంగా ఉద్యమాలు ఉండాలన్నారు. ఉపాధి హామీలో పనిచేసే క్షేత్రస్థాయి సిబ్బందిపై రాజకీయ ఒత్తిళ్లు పెరిగాయని, దీంతో సిబ్బంది అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ సక్రమంగా పనిచేయలేకపోతున్నారని చెప్పారు. క్షేత్రస్థాయి సిబ్బందికి ఉద్యోగ భద్రత లేకుండా చేస్తున్నారని, ముందుగా కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీలో పనిచేసే క్షేత్రస్థాయి సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ సక్రమంగా అమలవుతుందంటే మేటీల వ్యవస్థ ఉండడం వల్లనేనని, అయినా మేటీలను తొలగించే పరిస్థితి వచ్చిందన్నారు. మేటీల కమీషన్‌ను పునరుద్ధరించాలని, వారికి ఉపాధి కూలీలను సమన్వయం చేసుకునే అవకాశం కల్పించాలని, సైకిల్‌తో పాటు క్యాలిక్యులేటర్, చట్టంలో పొందుపరిచిన సదుపాయాలన్నీ వారికి అందించాలని కోరారు. ఉపాధి కూలీలకు 200 రోజులు పనిదినాలు కల్పించి రోజు కూలి 600 రూపాయలు ఇవ్వాలని, పని ప్రదేశాల్లో మెడికల్ కిట్లు, గుడారాలు, మజ్జిగ, తాగునీటి సదుపాయం కల్పించాలని జల్లి విల్సన్ డిమాండ్ చేశారు. గ్రామాలకు ఐదు కిలోమీటర్ల దూరంలో పని కల్పిస్తే ఆటో చార్జీలు ఇవ్వాలని, రెండు పూటలా పనివిధానం తీసివేయాలని, సమ్మర్ అలవెన్స్‌ను పునరుద్ధరించాలని, ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్ తీసివేసి పాత సాఫ్ట్‌వేర్ కొనసాగించాలని, పని ప్రదేశంలో ప్రమాదవశాత్తు మరణించిన కూలీకి నష్టపరిహారం కింద పది లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు.

ఆవుల శేఖర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు కూలీలతో చేయించాలని, ఏ మాత్రం ఉపయోగపడని పనులకు రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యమిస్తున్నాయని మండిపడ్డారు. రైతుల పొలాల్లో ఉపాధి కూలీలతో అనేక పనులు చేయించుకోవడానికి అవకాశం ఉన్నప్పటికీ వాటికి ప్రాధాన్యత ఇవ్వడం లేదన్నారు. పని ప్రదేశాలకు వ్యవసాయ కార్మిక సంఘం శ్రేణులు వెళ్లి ఉపాధి కూలీలతో కలిసి వారి సాధక బాధకాలు తెలుసుకొని... ఉన్నతాధికారులకు వినతిపత్రాల ద్వారా తెలియపరిచి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. రాష్ట్రంలో భూ సమస్యలు రోజురోజుకు జఠిలమవుతున్నాయని, భూమిని లేని నిరుపేదలు పెరిగిపోతున్నారని చెప్పారు. పేదవారికి సాగుభూములు పంచడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి చేతులు రావడం లేదన్నారు. భూస్వాములు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల చేతుల్లో ఉన్న భూములను సమాచార హక్కు చట్టం ద్వారా బయటకు తీసి పేదలకు పంచేలా భూ పోరాటాలు ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ల్యాండ్ టైటిలింగ్ చట్టం వల్ల పేదలు, చిన్న, సన్నకారు రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. దీనిపై పేదల సంక్షేమం కోరే సీఎం జగన్ పునరాలోచన చేయాలని కోరారు. సీహెచ్ కోటేశ్వరరావు, ఉప ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రావు మాట్లాడుతూ పేదలకు ముఖ్యమంత్రి జగన్ ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని కోరారు. ఇప్పటికే చాలామంది పేదలు రాష్ట్ర ప్రభుత్వం తెస్తున్న కొత్త కొత్త విధానాలతో సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారని చెప్పారు. న్యాయమైన సమస్యల కోసం అంగన్‌వాడీ టీచర్లు చేస్తున్న సమ్మెకు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటించింది. సమావేశం అనేక తీర్మానాలు ఆమోదించింది. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బండి వెంకటేశ్వరరావు, బి.కేశవరెడ్డి, సీహెచ్ ప్రభాకర్, సి.సుబ్రహ్మణ్యం, చిలుకూరు వెంకటేశ్వరరావు, కాబోతు ఈశ్వరరావు, తాటిపాక మధు, టి.కిష్టప్ప, ఆర్.విజయ, రామునాయుడు, కలిసెట్టి వెంకట్రావు, నబీ రసూల్, ఉప్పె నరసింహారావు, కె. రాధాకృష్ణ, జేబీ శ్రీధర్, విజయభారతి, భూపేశ్, అర్జున్, కళింగ లక్ష్మణ్, నాగుల్ మీరా తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల డిమాండ్లు పరిష్కరిస్తాం

అధ్యయనానికి మూడు నెలల సమయం: మంత్రి బొత్స

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: రాష్ట్రంలోని అంగన్‌వాడీ అక్క, చెల్లెమ్మల డిమాండ్ల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని, మూడు నెలల్లో అన్నింటికీ పరిష్కారం చూపిస్తుందని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. ఇటీవల మంత్రుల బృందం, అధికారులతో జరిగిన చర్చల్లో ప్రస్తావనకు వచ్చిన అన్ని అంశాలను నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. వీటిపై ఇప్పటికే కేంద్రానికి లేఖ రాశామని, అక్కడ నుంచి స్పందన వచ్చిన వెంటనే అధ్యయనం చేసి అక్క, చెల్లెమ్మలు కోరిన మాదిరిగానే నిర్ణయం తీసుకుంటామన్నారు. అంగన్‌వాడీల సమ్మెపై స్పందిస్తూ విశాఖపట్టణంలోని ప్రభుత్వ అతిథి గృహంలో గురువారం సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సానుకూలంగా స్పందించి సూచించిన అనే అంశాలను వివరించారు. అంగన్‌వాడీ సహాయకులను వర్కర్లుగా పదోన్నతి కల్పించేందుకు ప్రస్తుతం ఉన్న 45 ఏళ్ల వయస్సును 50 సంవత్సరాలకు పెంచడం, అలాగే, గ్రాట్యుటీకి సంబంధించి అంగన్‌వాడీ కార్యకర్తలకు సేవా ముగింపు ప్రయోజనాన్ని రూ.లక్షకు, హెల్పర్లకు రూ.40 వేలకు పెంచాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. అక్క, చెల్లెమ్మలు వెంటనే విధుల్లో చేరి గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఇబ్బందులకు గురవ్వకుండా సేవలందించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

పింఛన్ల పేరిట రూ.3,513 కోట్లు స్వాహా

- జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం గోరంత చేస్తూ కొండంత ప్రచారం చేసుకుంటుందని, సంక్షేమం ముసుగులో దోపిడీకి పాల్పడుతోందని జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ విమర్శించారు. ఒకటో తేదీ తెల్లవారుజామునే ప్రతి ఇంటికి వెళ్లి అవ్వాతాతలకు సామాజిక పెన్షన్లు అందిస్తున్నామని గొప్పగా చెప్పుకుంటున్న వైసీపీ నాయకులు... లెక్కల గారడీతో వేలకోట్లు దోచుకుంటున్నారని ఆరోపించారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తదితరులకు ఇచ్చే సామాజిక పింఛన్లలోనే నెలకు రూ.292 కోట్లు దోచుకుంటున్నారని, ఏడాదికి రూ.3,513.57 కోట్లు స్వాహా చేస్తున్నారని ఆయన వివరించారు. గురువారం జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సామాజిక పెన్షన్లలో జరుగుతున్న అవకతవకలను లెక్కలతో సహా బయటపెట్టారు. ఉదాహరణకు నవంబరులో 54,69,161 మందికి రూ.2,750 చొప్పున రూ.1503.99 కోట్లు పెన్షన్ల కింద ఖర్చు చేశామని ప్రభుత్వం ప్రకటించింది. డిసెంబరు నెలలో 54,49,190 మందికి పెన్షన్లు అందించామని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అంటే ఒక్క నెలలో 19,871 పెన్షన్లు తగ్గిపోయాయి. ఇది ఎలా సాధ్యం? ఒక్క నెలలో దాదాపు 20 వేల పింఛన్లు ఎలా తగ్గిపోయాయని ప్రశ్నించారు. ఇటీవల జరిగిన మంత్రివర్గంలో 54,69,069 మందికి పెన్షనర్లకు పింఛన్ ఇస్తున్నట్లు ఆమోదించి, మీడియా ముందు మాత్రం 65 లక్షల మందికి ఇస్తున్నట్లు చెప్పారు. ఎంత మోసమో గమనించాలని ప్రజలను కోరారు. మంత్రివర్గ తీర్మానాలను కూడా వక్రీకరించి దొంగ లెక్కలతో కోట్లు దోచుకుంటున్నారు. దీనికి ఎవరు బాధ్యత వహిస్తారు? ముఖ్యమంత్రి వహిస్తారా? లేదా సంబంధిత మంత్రి బాధ్యత వహిస్తారా? చెప్పాలని నాదెండ్ల డిమాండ్ చేశారు. టీడీపీతో ఎన్నికల పొత్తుపై ప్రశ్నించగా ఎవరెక్కడ పోటీ చేయాలన్న దానిపై ప్రస్తుతం చర్చలు జరుగుతున్నాయి. సంక్రాంతినాటికి అవి ఒక కొలిక్కి వస్తాయి. అలాగే ఉమ్మడి ఎన్నికల మేనిఫెస్టో కూడా అదే సమయంలో పూర్తవుతుందని చెప్పారు.

జగన్ పుట్టిన రోజు వేడుకలు

సీఎంకు మంత్రులు, నేతల శుభాకాంక్షలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పుట్టిన రోజు వేడుకలను గురువారం నిర్వహించారు. జగన్‌కు అనేక మంది ప్రముఖులు, మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు నేరుగాను, సోషల్ మీడియా వేదికగాను శుభాకాంక్షలు తెలిపారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో భారీ కేక్‌ను కట్ చేసి జగన్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా, నియోజకవర్గ పార్టీ కార్యాలయాల్లో జగన్ పుట్టిన రోజు వేడుకలను నిర్వహించారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు హాజరై కేక్‌లు కట్ చేశారు. వైసీపీ శ్రేణులు అన్ని నియోజకవర్గాలలో అన్నదానం, వస్త్ర దానం, రక్తదానం, మొక్కలు నాటడం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. తెలుగు రాష్ట్రాలతో పాటు విదేశాల్లోనూ వైసీపీ అభిమానులు సోషల్ మీడియా వేదికగా జగన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జలతో పాటు మంత్రి మేరుగ నాగార్జున, ఎంపీ నందిగం కిషోర్, ఎమ్మెల్సీ పోతుల సునీత, పార్టీ నేతలు జూపూడి ప్రభాకర్, లక్ష్మీపార్వతి తదితరులు భారీ కేక్‌ను కట్ చేసి, జగన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు జగన్‌కు మంచి జరగాలని ఆకాంక్షిస్తూ, సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం సజ్జల మాట్లాడుతూ పేదల జీవితాల్లో సీఎం వైఎస్ జగన్ వెలుగు నింపారని కొనియాడారు. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో దోచుకున్నారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల కోసం కొన్ని శక్తులు మళ్లీ ఏకమయ్యాయని దుయ్యబట్టారు. ఈ వేడుకలకు పార్టీ నేతలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు తదితరులు హాజరయ్యారు.

సైనిక వాహనాలపై ఉగ్ర దాడి

అమరులైన ముగ్గురు జవాన్లు

శ్రీనగర్: జమ్మూకాశ్మీర్‌లో భద్రతాబలగాలే లక్ష్యంగా జరిపిన ఉగ్రదాడిలో ముగ్గురు జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. ఇక్కడి పూంచ్ జిల్లాలో జవాన్లు ప్రయాణిస్తున్న రెండు సైనిక వాహనాలపై ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో ముగ్గురు జవాన్లు అమరులవగా, మరో ముగ్గురు గాయపడినట్లు అధికారులు వెల్లడించారు. పూంచ్ జిల్లాలోని బుఫ్లియాజ్ సమీపంలో బుధవారం రాత్రి నుంచి ఉగ్రవాదుల కోసం వేట సాగుతోంది. ఈ క్రమంలోనే రెండు వాహనాల్లో జవాన్లు ఆ ప్రదేశానికి బయల్దేరారు. రాజౌరీ-ఠాణామండీ-సురన్‌కోటే రహదారిపై సావ్ని ప్రాంతానికి చేరుకోగానే ఒక్కసారిగా ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. ఈ దాడిలో ముగ్గురు జవాన్లు అమరులయ్యారు. జవాన్లు సైతం ఉగ్రవాదులపై ఎదురుకాల్పులకు పాల్పడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే ఘటనాస్థలానికి అదనపు బలగాలతో పాటు అంబులెన్స్‌లను తరలించినట్లు అధికారులు తెలిపారు. నెల రోజుల వ్యవధిలో ఈ ప్రాంతంలో సైన్యంపై ఇది రెండో ఉగ్రదాడి కావడం గమనార్హం.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించేవరకు

పోరాటం ఆగదు

అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ఈశ్వరయ్య హెచ్చరిక

నేడు రాష్ట్రవ్యాప్తంగా రాస్తారోకోలు : జె.లలిత

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించేంతవరకు పోరాటం ఆగదని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు గుజ్జుల ఈశ్వరయ్య హెచ్చరించారు. తాము కొత్త కోరికలేమీ కోరడం లేదని, ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలనే అమలు చేయమని, సుప్రీంకోర్టు తీర్పుకనుగుణంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు. వేంపల్లి ఐసీడీసీ ప్రాజెక్టు ఆఫీసు దగ్గర ఉన్న పాపాగ్ని నదిలో వేంపల్లి ప్రాజెక్టు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్‌తో కలసి నదిలో మానవహారంగా ఏర్పడి వినూత్న నిరసన తెలియజేశారు. అనంతరం ఐసీడీసీ ప్రాజెక్టు ఆఫీసు వద్ద ఏర్పాటు చేసిన సమ్మె శిబిరం వద్ద ఈశ్వరయ్య మాట్లాడారు. పది రోజులుగా మహిళలు రోడ్డెక్కి ... హామీలు అమలు చేయాలని కోరుతుంటే సీఎం కనీసం స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. పైగా ఉద్యమాన్ని అణచివేయాలని చూడటం జగన్ నియంతృత్వ ధోరణికి పరాకాష్ఠగా పేర్కొన్నారు. శ్రామిక మహిళలపై దాడికి దిగి రాజకీయ ప్రతిష్ఠ కోల్పోయాక సమ్మె విరమింప చేసినా ఫలితం ఉండదన్నారు. ఇది లక్ష మందికి పైగా చేస్తున్న అతిపెద్ద సమ్మె అన్నారు. లక్షలాది మంది శిశువులకు రెండో తల్లులై పోషణ బాధ్యత చూసే మాతృమూర్తుల పోరాటమన్నారు. ఇకనైనా జగన్ స్పందించి అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో మహిళల ఆగ్రహానికి మసికాక తప్పదని ఈశ్వరయ్య హెచ్చరించారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంజుల, సీపీఐ పులివెందుల ఏరియా కార్యదర్శి వెంకట రాములు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి వ్యాఖ్యలను నిరసిస్తూ నేడు రాస్తారోకోలు

అంగన్‌వాడీల సమస్యలపై గురువారం స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి మీడియాతో మాట్లాడిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరంగా ఉన్నాయని, ఇందుకు నిరసనగా శుక్రవారం ఉదయం 11 నుండి 11.30 గంటల వరకు రాష్ట్రవ్యాప్తంగా రాస్తారోకోలు చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ), అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ), ఏపీ ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) నాయకులు జె.లలితమ్మ, కె.సుబ్బరావమ్మ, వీఆర్ జ్యోతి సంయుక్త ప్రకటనలో పిలుపునిచ్చారు. రూ.16 కోట్లు చీరలకు ఇచ్చామని మంత్రి చెప్పటం సిగ్గుచేటన్నారు. సెల్‌ఫోన్‌ల కోసం 85 కోట్ల రూపాయలు ఇచ్చామని చెప్పారని, వాస్తవానికి అవి సెంటర్ల నిర్వహణకు సంబంధించినవని తెలిపారు. అలాగే రూ.12 కోట్ల రీఛార్జి కోసం ఇస్తున్నామని చెప్తున్నారని, అయితే ఇప్పటికీ ఆ మొబైల్స్ పని చేయక సొంత మొబైల్స్‌తో పనిచేస్తున్నట్లు తెలిపారు. అనేక పర్యాయాలు ప్రభుత్వానికి గ్యాస్, ఆకు కూరలు, కూరగాయలు, పోపు దినుసులకు కోట్ల రూపాయలు మిగులుతాయని ప్రీస్కూల్ పిల్లలకు పీపీ 1, పీపీ 2 బోధించవచ్చని యూనియన్లుగా అనేక పర్యాయాలు చెప్పినప్పటికీ టేక్ హోమ్ రేషన్ ప్రవేశపెట్టారని చెప్పారు. దీనికి సంబంధించి ఎఫ్ఆర్ఎస్ యాప్ అదనంగా తీసుకురావటంతో తీవ్ర సమస్యలు ఉత్పన్నమయ్యాయని పేర్కొన్నారు. చింతా ప్రతాపరెడ్డి నోటికి వచ్చిన విధంగా మాట్లాడుతున్నారని, అనవసరపు వ్యాఖ్యలు వెంటనే మానుకోవాలని, లేనిపక్షంలో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించండి : దేగా ప్రభాకర్

అంగన్వాడీల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు దేగా ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏలూరు జిల్లా లింగపాలెం మండలం తహసీల్దార్ కార్యాలయం వద్ద 10 రోజులుగా అంగన్వాడీలు చేస్తున్న సమ్మెకు దేగా ప్రభాకర్ మద్దతు పలికారు. కాంగ్రెస్ పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్‌రావు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ నాయకులు టీజేఎస్ కుమారి, వి.ఈశ్వరి, సెక్టార్ బాధ్యులు ఆర్. మార్తమ్మ, మేరీ కుమారి తదితరులు పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.